విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

శనివారం 21 సెప్టెంబర్ 2024 8 పేజీలు

ప్రతి కుటుంబానికి
ప్రభుత్వ ఫలాలు

సీఎం చంద్రబాబు నాయుడు

- అక్టోబర్‌లో గ్రామసభల ద్వారా అర్హులకు పింఛన్లు
- కల్లుగీత కార్మికులకు మద్యం దుకాణాల్లో 10 శాతం రిజర్వేషన్
- తప్పులు చేసి ఎదురుదాడి చేస్తే చూస్తూ ఊరుకోం...
- గత పాలకులు చేసిన తప్పులను సరిదిద్దుతున్నాం...
- సుపరి పాలన కోసం యజ్ఞంలా పనిచేస్తున్నాం
- మద్దిరాలపాడులో 'ఇది మంచి ప్రభుత్వం'

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : ప్రతి ఇంటికి ప్రభుత్వ ఫలాలు అందాలి...ప్రతి కుటుంబానికి సంక్షేమం అందాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. గత పాలకుల దోపిడీ, దౌర్జన్యాలు, దుర్మార్గాలతో గాడితప్పిన రాష్ట్రాన్ని మళ్లీ గాడిన పెట్టేందుకు యజ్ఞంలా పని చేస్తున్నామని, నిండు మనసుతో ప్రజలు ఆశీర్వదిస్తే రాష్ట్రాన్ని నెంబర్‌వన్‌గా చేసి చూపుతామని స్పష్టం చేశారు. ప్రకాశం జిల్లా, మద్దిరాలపాడులో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో సీఎం చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. గ్రామంలో ప్రజల ఇళ్లకు వెళ్లి వారి కుటుంబ పరిస్థితులు, యోగ క్షేమాలను గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని ఆంజనేయస్వామిని దర్శించుకున్న అనంతరం గ్రామస్తులతో 'ముఖాముఖి' నిర్వహించి అక్కడికక్కడే సమస్యలను పరిష్కరించారు. అనంతరం ప్రజలనుద్దేశించి సీఎం చంద్రబాబు ప్రసంగించారు.

బలవంతంగా సభలకు రావాలని వేధింపులు లేవు

"నేను చాలా మంది సీఎంలను చూశాను కానీ...గత ప్రభుత్వంలో ఉన్నటువంటి సీఎంను ఎప్పుడూ చూడలేదు. ఎప్పుడైనా ప్రజల మధ్యకు వచ్చారా.? మీ సమస్యలు అడిగి తెలుసుకున్నారా? పరిష్కరించారా? ఎక్కడికన్నా వెళ్తే ఆ పరిసరాల్లో చెట్లు నరికించేవారు. ప్రజలు ఎవరూ చూడకుండా పరదాలు కట్టించేవారు. ఇష్టమున్నా, లేకున్నా ప్రజలు ఆయన సభలకు రావాలి. లేదంటే ఇంటికి వచ్చే నీళ్లో, రేషన్ కట్ చేస్తారు. ఆ అరాచకాలన్నీ భరించలేక ప్రజలు వారి ప్రభుత్వాన్ని భూస్థాపితం చేశారు. పాలనలో మార్పులు తీసుకొచ్చి, ప్రజలకు మరింత సేవ అందించాలని నేను, నా మిత్రుడు పవన్ కళ్యాణ్, నరేంద్రమోదీ నిర్ణయించుకున్నాం. ఈ గ్రామంలోనే ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లి కలిసి సమస్యలు తెలుసుకున్నాను. మీ సమస్యలు

నేరుగా తెలుసుకుని పరిష్కరించడానికే మీ వద్దకు వస్తున్నా. పఠాన్ ఖాజావలి అనే వ్యక్తి ఇంటికి వెళ్లా...ఆయనకు తల్లి, భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. అతని తల్లికి రూ.4 వేలు పెన్షన్ వస్తోంది. కానీ ఆర్థిక ఇబ్బందులతో వారి ఇద్దరి బిడ్డలను చదివించలేకపోయారు. వారిని ప్రభుత్వమే చదివిస్తుంది. ఖాజావలి కుటుంబానికి 2019కి ముందు టీడీపీ ప్రభుత్వంలో ఇల్లు మంజూరైంది...2 బిల్లులు కూడా మంజూరు చేశాం. కానీ వైసీపీ ప్రభుత్వం వచ్చాక రూ.65,150 బిల్లు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టారు...ఆ డబ్బులను మీ అందరి సమక్షంలో వారి కుటుంబానికి ఇస్తున్నాం. దేశంలోనే మొదటిసారిగా ఎన్టీఆర్ పింఛన్ల విధానాన్ని రూ.35 లతో ప్రారంభించారు. తర్వాత దాన్ని నేను రూ.70 లకు పెంచాను. 2014లో అధికారంలోకి రాగానే మళ్లీ రూ.2 వేలకు పెంచాను. ఇప్పుడు రూ.4 వేలకు పెంచాను. ఏడాదికి సుమారు రూ.35 వేల కోట్లు పింఛన్లకు ఖర్చు అవుతోంది. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం ఏప్రిల్, మే, జూన్ నెలల పింఛన్లు కూడా కలిపి జూలైలో రూ.7 వేలు అందించాం. 1వ తేదీన సెలవు రోజు వస్తే ఉద్యోగులు, లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా ఒకరోజు ముందే పింఛన్లు ఇచ్చాం. పేదల సేవలో భాగంగా ప్రతి పేదవాడి ఇంటికి వెళ్లి కష్టాలు తెలుసుకునేలా పింఛన్ల కార్యక్రమం నిర్వహిస్తున్నాం. పెన్షన్లను గత ప్రభుత్వం అస్తవ్యస్తంగా తయారు చేశారు. దొంగ సదరం సర్టిఫికేట్లు తెచ్చుకుని వికలాంగుల కోటాలో పింఛన్లు తీసుకున్నారు. అర్హులందరికీ పింఛను అందించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది. కానీ తప్పుడు సర్టిఫికేట్లతో లబ్ధిపొందాలని చూస్తే చర్యలుంటాయి...డాక్టర్లు మిగతా 2లో...

'బూచేపల్లి'కి వైసీపీ జిల్లా అధ్యక్ష పగ్గాలు

- ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడిగా చెవిరెడ్డి
- జిల్లా ముఖ్యనేతలతో వైఎస్ జగన్ సమావేశం
- 'బాలినేని' పార్టీ మార్పుపై చర్చ
- వెళ్లిన వారి గురించి ఆలోచన వద్దు
- పార్టీ క్యాడర్‌కు సూచన

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రకాశం జిల్లా అధ్యక్షుడిగా దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడిగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని నియమిస్తూ శుక్రవారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి లేఖను విడుదల చేశారు. వైసీపీలో పదేళ్లపాటు చక్రం తిప్పిన జిల్లాకు చెందిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి వైసీపీకి రాజీనామా చేసి జనసేనలో చేరబోతున్నట్లు ప్రకటించిన విషయం విధితమే. దీంతో జిల్లాలోని వైసీపీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జి జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మతో శుక్రవారం మధ్యాహ్నం తాడేపల్లిలో ఆ పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డి సమావేశం అయ్యారు. బాలినేనికి ఎంతో చేశాం, పార్టీ వీడడం ఆయన విజ్ఞతకే వదిలేయండి, వెళ్లినవారి గురించి ఆలోచించవద్దు ఉన్నవారు కలిసి కట్టుగా పనిచేయండి అని సూచించారు. 2లో

విశాలాంధ్ర - ఒంగోలు :

పంచాయతీలు బాగుంటేనే రాష్ట్రాభివృద్ధి

- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్
- అభివృద్ధి సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం
- కలెక్టర్ జె.వెంకటమురళి
- సంతమాగులూరులో 'ఇది మంచి ప్రభుత్వం'

విశాలాంధ్ర - బాపట్ల : పంచాయతీలు బలంగా ఉంటేనే గ్రామాలు, జిల్లా, రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఏపీ రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా శుక్రవారం జరిగాయి. సంతమాగులూరు మండలం, మిన్నేకల్లు గ్రామంలో జరిగిన కార్యక్రమానికి గొట్టిపాటి రవికుమార్, జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వినతి పత్రాల ద్వారా కొందరు తమ సమస్యలను విన్నవించగా, మరి కొందరు మా ఇబ్బందులను తొలగించాలని అభ్యర్థించడంతో తక్షణమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామ సచివాలయం వద్ద మొక్కలు నాటారు. గ్రామీణ వ్యవస్థలు నిర్వీర్యం అవుతున్న పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం వాటిని బలోపేతం చేసి అభివృద్ధికి బాటలు వేస్తోందని రాష్ట్ర మంత్రి రవికుమార్ చెప్పారు. వందరోజుల పాలన దిగ్విజయంగా ముగించుకుని అభివృద్ధివైపు ప్రభుత్వం అడుగులు ముందుకు వేస్తుందని చెప్పారు. ప్రజలకు ఉపయోగపడే పనులను మాత్రమే ప్రభుత్వం చేపడుతుందని స్పష్టం చేశారు. ప్రజలలోకి వెళ్లాలి, వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారన్నారు. అన్ని గ్రామాలలో ఈ కార్యక్రమాలు వారం రోజులు పాటు జరుగుతాయన్నారు. 40 వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇస్తున్నామని ప్రకటించారు. విపత్తు ప్రభావాన్ని తగ్గిస్తూ సహాయక చర్యలు అందించడంలో కృతార్థులయ్యారన్నారు. వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ నిరంతరాయంగా ఇస్తామన్నారు. మిన్నేకల్లు గ్రామానికి రూ.4.20 కోట్ల నిధులు మంజూరు చేశామన్నారు. ఉపాధి హామీ పథకం కింద రహదారులు, మురికి కాల్వలు నిర్మిస్తామన్నారు. అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తుందని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. ప్రతి ఇంటి ముందు ఇంకుడు గుంతలు తొవ్వుకుంటే ప్రభుత్వం నుంచి ఉపాధి హామీ పథకం కింద రూ.15 వేలు నగదు అందజేస్తామని తెలిపారు. ప్రజల సంక్షేమం కొరకు ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో చీరాల ఆర్డీవో సూర్యనారాయణ రెడ్డి, ఎండిఓ లక్ష్మీదేవి, మండల ప్రత్యేక అధికారి రమేష్ బాబు, ఎంపీపీ యలమంద, సర్పంచ్ ఎం.గోవిందమ్మ, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

‘బూచేపల్లి’కి వైసీపీ జిల్లా అధ్యక్ష పగ్గాలు

విశాలాంధ్ర - ఒంగోలు : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రకాశం జిల్లా అధ్యక్షుడిగా దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడిగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని నియమిస్తూ శుక్రవారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి లేఖను విడుదల చేశారు. వైసీపీలో పదేళ్లపాటు చక్రం తిప్పిన జిల్లాకు చెందిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి వైసీపీకి రాజీనామా చేసి జనసేనలో చేరబోతున్నట్లు ప్రకటించిన విషయం విదితమే. దీంతో జిల్లాలోని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఆయా నియోజకవర్గాల ఇన్‌చార్జి జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మతో శుక్రవారం మధ్యాహ్నం తాడేపల్లిలో ఆ పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డి సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా బాలినేని పార్టీ వీడడంపై చర్చ జరిగినట్లు సమాచారం. బాలినేనికి ఎంతో చేశాం, పార్టీ వీడడం ఆయన విజ్ఞతకే వదిలేయండి, వెళ్లినవారి గురించి ఆలోచించవద్దు ఉన్నవారు కలిసి కట్టుగా పనిచేయండి, భవిష్యత్తు మనదే అంటూ జిల్లా నేతలకు జగన్మోహన్‌రెడ్డి సూచించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. జిల్లాలో పార్టీ నాయకులకు, కార్యకర్తలకు మీరు ఇన్‌ఛార్జిలుగా ఉన్నారు. మీరు వారికి భరోసా కల్పించండి, మీకేదేమైనా అవసరం ఉంటే నేరుగా నా దగ్గరకు రండి మాట్లాడండి అని జిల్లాకు చెందిన నాయకులను ప్రోత్సహించారు.

- **ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడిగా చెవిరెడ్డి**
- **జిల్లా ముఖ్యనేతలతో వైఎస్ జగన్ సమావేశం**
- **‘బాలినేని’ పార్టీ మార్పుపై చర్చ**
- **వెళ్లిన వారి గురించి ఆలోచన వద్దు**
- **పార్టీ క్యాడర్‌కు సూచన**

జిల్లా అధ్యక్షులుగా బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని ప్రకటిస్తున్నాను. జిల్లాలో మీరందరూ శివప్రసాద్‌రెడ్డికి సహకరించండి అందరూ టీం వర్క్ చేయండి. మిమ్మల్ని నేను జాగ్రత్తగా చూసుకుంటానంటూ జగన్మోహన్‌రెడ్డి జిల్లాకు చెందిన నాయకులకు తెలిపారు. అయితే బాలినేని జనసేనలో చేరే సందర్భంగా జిల్లాలోని వైసీపీకి చెందిన కార్పొరేటర్లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచులు పార్టీని వీడే అవకాశం ఉన్నట్లు బాలినేని చెప్పిన నేపథ్యంలో పార్టీ నాయకులతో ప్రత్యేకంగా మాట్లాడి పార్టీని ఎవరూ వీడకుండా ఉండే విధంగా చొరవ చూపాలని నాయకులకు జగన్మోహన్‌రెడ్డి సూచించినట్లు సమాచారం. ఈ సమావేశంలో వైసీపీ ప్రధాన కార్యదర్శిగా విజయసాయిరెడ్డి, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకులుగా ఉన్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డితో పాటు యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, గిద్దలూరు ఇన్‌చార్జి కుందురు నాగార్జునరెడ్డి,

మార్కాపురం ఇన్‌ఛార్జి అన్నా రాంబాబు, కనిగిరి ఇన్‌ఛార్జి దద్దాల నారాయణ యాదవ్, కొండెపి ఇన్‌చార్జి మరియు మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్, జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ సమావేశంలో పాల్గొన్నారు.

సమర్థుడికే పగ్గాలు

- హర్షం వ్యక్తం చేస్తున్న వైసీపీ క్యాడర్

జిల్లాలో నిన్నటి వరకు ముఖ్యనేతగా ఉన్న బాలినేని శ్రీనివాసరెడ్డి పార్టీకి రాజీనామా చేసి జనసేన పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో ఆ పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్‌రెడ్డి వెంటనే స్పందించారు. శుక్రవారం జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా అధ్యక్షులుగా బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని ప్రకటించారు. దీంతో సమర్థుడికే పార్టీ పగ్గాలు అప్పగించారని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్య నేతలు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా రాజకీయాల్లో బూచేపల్లి కుటుంబానికి ప్రత్యేక స్థానం ఉంది. ఆయన తండ్రి బూచేపల్లి సుబ్బారెడ్డి కాంగ్రెస్ పార్టీ తరపున దర్శి ఎమ్మెల్యే టిక్కెట్టు ఆశించారు. కొన్ని అనివార్య పరిస్థితుల వలన అప్పటిలో కాంగ్రెస్ టిక్కెట్టు రాకపోవడంతో 2004లో దర్శి నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న వైయస్ రాజశేఖర్‌రెడ్డితో బూచేపల్లి సుబ్బారెడ్డికి ఉన్న సన్నిహిత సంబంధాలతో కాంగ్రెస్ పార్టీలో వైయస్ఆర్ వెనుక నడిచారు. 2009లో బూచేపల్లి సుబ్బారెడ్డి వారసుడిగా 2009లో కాంగ్రెస్ నుంచి శివప్రసాద్‌రెడ్డి ఎమ్మెల్యేగా పోటీ చేసి విజయం సాధించారు. తదనంతరం 2014లో కూడా శివప్రసాద్‌రెడ్డి పోటీ చేసి ఓటమి చెందారు. 2019 ఎన్నికల ముందు తన తండ్రి సుబ్బారెడ్డి మరణం కొన్ని పరిస్థితుల నేపథ్యంలో శివప్రసాద్‌రెడ్డి 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉన్నారు. 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ వైసీపీ నుంచి పోటీ చేసి శివప్రసాద్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచారు. రాష్ట్ర వ్యాప్తంగా కూటమి గాలి వీచినప్పటికీ దర్శిలో మాత్రం బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తన సత్తా చాటుకున్నారు. వైయస్ జగన్మోహన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీని విభేదించి వైసీపీ స్థాపించిన దగ్గర నుంచి నేటి వరకు జగన్‌కు విధేయుడిగా ఉన్నారు. బూచేపల్లి వెంకాయమ్మను కూడా జడ్పీ చైర్మన్‌గా అవకాశం కల్పించారు. ప్రస్తుతం పార్టీ కష్టకాలంలో ఉన్న నేపథ్యంలో పార్టీని నడిపించే సమర్థత శివకే ఉన్నట్లు గుర్తించిన జగన్మోహన్‌రెడ్డి శుక్రవారం ప్రకాశం జిల్లా అధ్యక్షునిగా బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పేరును ప్రకటించారు.

సీఎంకు ఘన స్వాగతం పలికిన మంత్రులు, ఎమ్మెల్యేలు

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకాశం జిల్లా పర్యటన విజయవంతంగా ముగిసింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి వందరోజుల పరిపాలన పూర్తి కావడంతో “ ఇది మంచి ప్రభుత్వం “ కార్యక్రమంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి జిల్లాకు వచ్చిన ఆయనను ఉమ్మడి ప్రకాశం జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర సాంఘిక సంక్షేమ, సచివాలయాలు, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ మాత్యులు డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, బాపట్ల పార్లమెంటు సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్, సంతనూతలపాడు శాసనసభ్యులు బి.ఎన్.విజయ్ కుమార్, కనిగిరి శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి, కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు, చీరాల శాసనసభ్యులు ఎం.ఎం.కొండయ్య, గుంటూరు రేంజ్ ఐజి సర్వ శ్రేష్ఠ త్రిపాఠీ, జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, ఎస్పీ ఏ.ఆర్.దామోదర్, జాయింట్ కలెక్టర్ .ఆర్. గోపాలకృష్ణ, మార్కాపురం సబ్ కలెక్టర్ బి.సహదిత్ వెంకట్ త్రివినాగ్, ఇతర అధికారులు, పలువురు ప్రజా ప్రతినిధులు హెలిప్యాడ్ వద్ద మర్యాదపూర్వకంగా కలిసి ఘన స్వాగతం పలికారు. మధ్యాహ్నం 2:32 గంటలకు ‘ చతుర్వాటిక విల్లాస్‌లో ముఖ్యమంత్రి హెలికాప్టర్ ల్యాండ్ అయింది. సాయంత్రం 5:30 గంటలకు హెలికాప్టర్ టేక్ ఆఫ్ అయింది. ప్రకాశం జిల్లాకు ముఖ్యమంత్రి వస్తున్నారని తెలిసిన గంటల వ్యవధిలోనే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు గట్టి భద్రత చర్యలు తీసుకోవడంతోపాటు వివిధ శాఖలు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లు చేయడంతో ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంగా ముగిసింది.

ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఫలాలు

(మొదటిపేజీ తరువాయి)

ఇష్టానుసారంగా వ్యవహరిస్తే ఉద్యోగాలకు ఎసరు వస్తుంది. ఈ ప్రభుత్వం పేదల కోసమే ఉంది. గత ఐదేళ్లు ఊరికో సైకో తయారయ్యాడు. ఎదురుదాడి చేస్తే భయపడటం కాదు...తాటతీస్తా అన్నారు.

ఇల్లులేని ప్రతి కుటుంబానికి సొంతిల్లు

‘ఈ గ్రామంలో 200 కుటుంబాలకు ఇళ్లులేవు... వారందరికీ స్థలం ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇస్తాం. గౌడలకు మద్యం షాపుల్లో 10 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తాం. తద్వారా బలహీన వర్గాలు కూడా ఆర్థికంగా బలపడతాయి. మేము అనుకుంటే 2 లక్షల మందితో సభలు పెట్టొచ్చు...కానీ గ్రామ స్థాయిలో అయితే నేరుగా మిమ్మల్ని కలవొచ్చు. నేను వచ్చింది మిమ్మలన్ని చూడటానికి...ఎటువంటి ఆర్భాటాలు, హంగులు లేకుండా వచ్చా. ఆర్భాటాలు చేస్తే ఏమీ రాదు. నేను చేసే పనులతో మీ జీవితాల్లో మార్పులు రావాలనేదే ఆలోచన. గాడి తప్పిన పాలన గాడిన పెడుతున్నాం. ప్రజలు నమ్మి 93 శాతం సీట్లు ఇచ్చి గెలిపించారు. ప్రజలు గెలవాలి...రాష్ట్రాన్ని నిలబెట్టాలి...మీ భవిష్యత్తు బాగుండాలని ఓట్లు వేశారు. గత పాలకుల విధానాలతో అప్పటికే రాష్ట్రం వెంటిలేటర్ పై ఉంది. మీరు 21 మంది ఎంపీలను ఇవ్వడంతో ఢిల్లీలో మన రాష్ట్ర పరపతి పెరిగింది. కేంద్రం కూడా సహకరిస్తోంది. మీరు చూపిన చొరవే రాష్ట్రాన్ని నిలబెడుతోంది.’ అని సీఎం చంద్రబాబు అన్నారు.

ప్రభుత్వ ఆస్తులు, పరువును కాపాడుతున్నాం

‘విచ్చలవిడితనంతో రూ.10లక్షల కోట్ల అప్పులు చేశారు. ప్రభుత్వానికి కూడా పరువు, ఆస్తులు ఉంటాయి. వాటిని పోగొట్టుకోకూడదు...అందుకే ప్రభుత్వ ఆస్తులు, పరపతిని కాపాడుకుంటూ వస్తున్నాం. 7 ప్రధాన అంశాలపై శ్వేత పత్రం విడుదల చేసి వాస్తవాలు మీ కళ్లముందు ఉంచాం. శాఖలపై సమీక్షలు చేస్తుంటే ఆశ్చర్యం కలుగుతోంది. కేంద్రం నుండి వచ్చిన నిధులు దారి మళ్లించారు. పంచాయతీలకు రూ.990 కోట్లు ఇవ్వలేదు...వాటిని మేమొచ్చి ఇవ్వడంతో కేంద్రం నుండి రూ.12 వందల కోట్లు మ్యాచింగ్ గ్రాంట్ వచ్చింది. అన్ని రంగాలను నిర్వీర్యం చేశారు. కేంద్రం జల్ జీవన్ మిషన్ పథకం తీసుకొచ్చింది. ఆ పథకాన్ని కూడా గత ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. చాలా రాష్ట్రాలు రాష్ట్రవాటా నిధులు ఖర్చు పెట్టి ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసుకున్నారు. కానీ మన రాష్ట్రంలో ఇచ్చిన నిధులు కూడా ఖర్చు చేయకుండా దారి మళ్లించారు. అందుకే మళ్లీ సమీక్షలు చేసి రూ.500 కోట్లు రాష్ట్రం వాటా విడుదల చేసి పనులు ప్రారంభించాలని నిర్ణయించాం. అన్ని వ్యవస్థలను నాశనం చేశారు...విధ్వంసం చేశారు. శ్రమించి రాష్ట్రాన్ని గాడిన పెడుతున్నాం. ఎవరో ఒకరు వచ్చి మేము అది చేస్తా...ఇది చేస్తా అంటే నమ్మి ఓట్లు వేస్తున్నారు. దీంతో కుదుటపడుతున్న రాష్ట్రాన్ని మళ్లీ కిందకు లాగుతున్నారు. స్థిర ప్రభుత్వం ఉంటే అభివృద్ధిని వేగంగా చేసుకోవచ్చు.’ అని సీఎం వివరించారు.

అందుబాటులో ఉంటే ఉచితంగా ఇసుక

‘మెగా డీఎస్సీ ద్వారా 16,347 ఉద్యోగాల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చాం. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ఇవ్వడమే లక్ష్యం. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశాం...కూటమి ప్రభుత్వం రాకుండా ఉంటే మీ భూమి మీకు దక్కకుండా పోయేది. రాజముద్రతో మళ్లీ మీకు పాసుపుస్తకాలు అందిస్తాం. గత పాలకులు ఏం చేసినా చెల్లుతుంది అని వ్యవహరించారు. 175 అన్న క్యాంటీన్లు ప్రారంభించాం... దుర్మార్గులు వాటిని కూడా గతంలో మూసేశారు. ఇక్కడే గుండ్లకమ్మ ఉంది...మీకు అవసరమైతే మీ ట్రాక్టర్ తీసుకెళ్లండి, ఎడ్లబండిని తీసుకెళ్లైనా ఇసుక తెచ్చుకోండి. మీకు అందుబాటులో

ఉన్న చోటనుండి స్వేచ్ఛగా ఇసుక తీసుకెళ్లండి. మీకు ఎక్కడ కావాలంటే అక్కడి నుండి ఇసుక తీసుకెళ్లండి. కానీ అతిగా తవ్వకుండా భూగర్భ జలాలకు ఇబ్బంది లేకుండా తవ్వకాలు చేయాలని సూచిస్తున్నా. ఇసుక దొరకని ప్రాంతాల వారు 24 గంటల పాటు బుక్ చేసుకునే సదుపాయం కల్పించాం. నాసిరకం మద్యంతో గత ఐదేళ్లు విచ్చలవిడిగా దోచేశారు. రూ.90 ఉండాల్సిన క్వార్టర్ ధరను రూ.149లకు అమ్మి దోచుకున్నారు. కేంద్రం కూడా మంచి కార్యక్రమాలు చేస్తోంది...వాటిని కూడా వినియోగించుకుండా. పోలవరానికి రూ.12,500 కోట్లు, అమరావతికి రూ.15 వేల కోట్లు, 3 పారిశ్రామిక కారిడార్లకు రూ.5 వేల కోట్లు కేంద్రం ఇచ్చింది. 70 ఏళ్ల పైబడిన వారికి రూ.6 లక్షల దాకా ఆరోగ్య బీమా ఇచ్చింది.’ అని సీఎం వివరించారు.

ప్రజలు బుద్ధి చెప్పడంతో ఇంట్లో కూర్చుని మూడు నెలల్లోనే ఏమీ చేయలేదని మాటలు

ప్రజలు బుద్ధి చెప్పడంతో ఓడిపోయి ఇంట్లో కూర్చుని 3 నెలల్లోనే అది చేయలేదు...ఇది చేయలేదు అని మాట్లాడుతున్నారు. వారు 6 నెలలదాకా ఒక్కపనైనా చేశారా.? ప్రతి మతస్తుడికి ఆ మతంపై విశ్వాసం ఉంటుంది. తిరుమల పవిత్రను గత పాలకులు దెబ్బతీశారు. లడ్డులో కల్తీ నెయ్యి వాడారు. రూ.320లకే నెయ్యి వస్తుందని కల్తీ నెయ్యితో దేవుడికి నైవేద్యం పెట్టారు. ఇప్పుడు మేం తప్పు చేయలేదు. టెండర్లు పిలిచామని బుకాయిస్తున్నారు.

కనీసం రూ.500 లకు వచ్చే నెయ్యి రూ.320 లకే ఇస్తున్నారంటే ఆలోచించాలి కదా.? ఈ విధంగా ప్రవర్తిస్తే భక్తుల మనోభావాలు దెబ్బతినవా? వైసీపీ ప్రభుత్వంలో ప్రసాదం, దర్శనాలు, అన్నప్రసాదం ఏమీ బాగోలేవు. నేను సీఎం అవ్వగానే టీటీడీలో కొత్త ఈఓను నియమించి ప్రక్షాళన చేపట్టాం. లడ్డులో నాణ్యత పెంచాం. కల్తీ నెయ్యి తెచ్చి తిరుమల పవిత్రను దెబ్బతీసిన వారిని వదిలిపెట్టాలా.? నంగనాచిగా మాట్లాడే ప్రజలు నమ్ముతారా.? ఇదే జిల్లాకు చెందిన వ్యక్తి టీటీడీ ఛైర్మన్‌గా చేశాడు...అతని పేరు చెప్పడం కూడా ఇష్టం లేదు...చేసిన తప్పులన్నీ చేసి ఇప్పుడు ఏదేదో మాట్లాడుతున్నారు.’ అని మండిపడ్డారు.

బోట్లు వదిలి ప్రకాశం బ్యారేజీని దెబ్బతీయాలని చూశారు..

“మూడు బోట్లను కృష్ణానదిలో వదిలి ప్రకాశం బ్యారేజీని దెబ్బతీయాలని చూశారు. ఆ పడవలు వేగంగా వచ్చి కౌంటర్ వెయిట్ ను ఢీ కొట్టాయి. అదే గేట్లను ఢీకొట్టి ఉంటే పెద్ద ప్రమాదం ఏర్పడేది. సొంత బాబాయినే చంపి గుండె పోటు అని ప్రచారం చేశారు...తర్వాత నారాసుర రక్త చరిత్ర అని నాపై రాశారు. నేరాలు చేసి ఎదుటి వారిపై నెట్టడం అలవాటుగా మారింది. రాజకీయ ముసుగులో నేరాలు చేస్తున్నారు. ముంబయి నటిని సంబంధం లేని కేసుల్లో ఇరికించి ఇబ్బందులు పెట్టారు...చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటుంటే మళ్లీ విమర్శలు చేస్తున్నారు. తప్పు చేసిన ఎవర్నీ వదలను. 24 గంటలూ నాకు ప్రజలే గుర్తుంటారు. ఏ2 మాట్లాడుతున్నాడు....నాకు అడ్మినిస్ట్రేషన్ గురించి తెలీదంట. నా అటెన్షన్ ఎవరూ డైవర్షన్ చేయలేరు. ప్రతి ఇంటికీ విద్యుత్, నీటి కనెక్షన్ ఇస్తాం. దీపావళి రోజున ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని ప్రారంభిస్తాం.’ అని సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారు.

'ఇది మంచి ప్రభుత్వం' విజయవంతం చేయాలి

ఎంపీడీవో ఆర్.జనార్ధన్

విశాలాంధ్ర-ముండ్లమూరు : నూతన ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తి అయిన సందర్భంగా ఇప్పటికీ ఎంతో ప్రభుత్వం సాధించిన ప్రగతి పురోగతిపై ఈనెల 20 నుంచి 26 వరకు మండలంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఆర్.జనార్ధన్ తెలిపారు. ఈనెల 22న మండలంలోనికెల్లంపల్లి సచివాలయంలో జరుగుతుంది అని చెప్పారు. సచివాలయ సిబ్బంది అందరూ వారికి కేటాయించిన గృహాలకు వెళ్లి వంద రోజులు ప్రభుత్వం సాధించిన ప్రగతిని వివరించి కరపత్రాలను పంపిణీ చేయాలని కోరారు. గ్రామాల్లోని ప్రతినిధులు, మండల అధ్యక్షులు. జిల్లా ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, మండల ప్రాదేశిక సభ్యులు, సర్పంచులు ,వార్డు సభ్యులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు, హాజరు కావాలని కోరారు.

విశాలాంధ్ర-వెలిగండ్ల : నేడు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి వెదుళ్ళచెరువు గ్రామానికి శనివారం విచ్చేయుచున్నరని మండలంలోని టిడిపి కార్యకర్తలు అభిమానులు పాల్గొనిపై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టిడిపి మండల అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి నాయకులు శ్యామల కాశిరెడ్డి, నియోజకవర్గం తెలుగు రైతు అధ్యక్షులు కేలం ఇంద్రభూపాల్ రెడ్డి, మండల తెలుగు రైతు అధ్యక్షులు మినీగా కాశయ్య, కీసర రమణారెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షులు గోన వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఇది మంచి ప్రభుత్వం' కరపత్రాలు పంపిణీ

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండలంలోని మంగాపురం, ఎదురు రాళ్లపాడు, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో, శుక్రవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమము పై ఆయా గ్రామ పంచాయతీల పంచాయతీ కార్యదర్శుల టిడిపి నాయకులు కార్యకర్తలు ఇంటింటా తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తి అయిన సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ,చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల గురించి ఇంటింటా తిరిగి ఇంటి యజమానులకు వివరించారు. కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు అభినందిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాలకోటయ్య, చిన్నసుబ్బయ్య ,టిడిపి మాజీ అధ్యక్షుడు కనకం నరసింహారావు, టిడిపి నాయకులు భీమాంజనేయరెడ్డి, నరసింహాఆటో ఎల్లయ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్‌లు - ప్రజారోగ్యానికి చిల్లు

- అనుమతులులతో పని లేదు తనిఖీలు అసలే లేవు
- డబ్బా నిండా రోగాలు - ప్రజలకు పంచుతున్న కల్తీ నీరు

విశాలాంధ్ర-పుల్లలచెరువు : ప్రస్తుత జీవనశైలిలో ప్రజలందరూ ప్యూరి ఫైడ్ వాటర్ తాగడానికే మక్కువ చూపిస్తుండగా అక్రమాలు ఇదే అవకాశంగా అశుద్ధ జలాన్ని అందిస్తూ లాభాలు గడిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఆరోగ్యం కోసమని తాగుతున్న ఈ వాటర్ తర్వాత రోజుల్లో అనారోగ్యాల బారిన పడేలా చేస్తోంది. ఈ విష జలాల వల్ల మనిషి ఆరోగ్య వ్యవస్థ క్షీణిస్తోంది. యర్రగొండపాలెం నియోజకవర్గంలో పుట్టగొడుగుల్లా వాటర్ ప్లాంట్‌లు పుట్టుకొచ్చాయి. జన నివాసాల మధ్య వేల ఫీట్ల బోర్లు వేసి ఏ మాత్రం నిబంధనలు పాటించ కుండా సంబంధిత అధికారి సూచనలు చేపట్టకుండా, బినామి సర్టిఫికెట్లతో ప్లాంట్లు నిర్వహిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్యూరిఫైడ్ వాటర్ పేరిట తూతూ మంత్రంగా బోరు నీటిలో కొన్ని కెమికల్స్ కలిపి అపరిశుభ్రమైన క్యాన్లు, ట్యాంకుల్లో నీరు సరఫరా చేస్తున్నారు. విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులకు తాగునీరు ప్రధాన కారణంగా కాగా ప్రస్తుతం ఎక్కడ చూసినా ప్యూరిఫైడ్ నీటి వినియోగం పెరిగి పోయింది. పట్టణాలు, గ్రామాలు తేడా లేకుండా అంతటా డబ్బా నీటిని వినియోగిస్తున్నారు. ఏ చిన్న శుభకార్యం జరిగినా డబ్బాలు డబ్బాలు తెప్పించి వచ్చిన ప్రతి ఒక్కరికి తాగిస్తున్నారు. యర్రగొండపాలెం నియోజక వర్గంలో ప్రతి మండలంలో ప్రతి గ్రామంలో రెండు చొప్పున పుట్టగొడుగుల్లా వెలిసిన వాటర్ ప్లాంట్లకు సరైన అనుమతులు లేవు. వీటిలో చాలా వరకు కనీస ప్రమాణాలు కూడా పాటించడం లేదు. కనీసం సమయంలో ప్రకారం ట్యాంక్‌లను శుభ్రం చెయ్యకుండానే వినియోగిస్తూ లాభాలు దండుకుంటున్నారు. రోగాల విజృంభణకు ప్రధాన కారణమైన వీటిని తనిఖీలు చేసే వ్యవస్థ కూడా లేదు. దీంతో మినరల్, ప్యూరిఫైడ్ వాటర్ పేరుతో డబ్బా నిండా రోగాలను ప్రజలకు పంచుతున్నారు. జిల్లాలో ఎక్కడ చూసినా 20 లీటర్ల క్యాన్ల నీటి వినియోగం విచ్చలవిడిగా జరుగుతోంది. ఈ నీరు లేకపోతే రోజు గడవదు అన్నట్లు తయారైంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రజలు కనిపించడం సర్వ సాధారణంగా మారింది. రూ.10,15 ఇంటికి చేరవేస్తే రూ.20 చొప్పున 20 లీటర్లకు వసూలు చేస్తున్నారు. కొందరు పేర్లు పెట్టి డబ్బా నీటిని విక్రయిస్తే మరి కొందరు మాత్రం వీటికి ఎలాంటి పేర్లు పెట్టకుండానే వాటర్ ప్లాంట్లు నడుపుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వాటర్ ప్లాంట్ లను పరిశీలించి, అనుమతులు లేని వాటిపై చర్యలు చేపట్టి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వారిపై చర్యలు చేపట్టి, శుద్ధజల వినియోగానికి కృషి చెయ్యాలని కోరుతున్నారు.

విద్యార్థులకు నేత్ర వైద్య పరీక్షలు



విశాలాంధ్ర-ముండ్లమూరు : మండల కేంద్రమైన ముండ్లమూరులోని ఆదర్శ పాఠశాల, జూనియర్ కాలేజీ లోని విద్యార్థిని విద్యార్థులకు దర్శి పట్టణానికి చెందిన జర్నలిస్ట్ గర్నెపూడి ప్రేమ్ కిషోర్ సహకారంతో నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓ(2) కే వెంకటేశ్వర్లు, దర్శి ఎస్ఐ ఎం మురళి హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఆకుకూరలు, కూరగాయలు తినడం వలన కంటి సమస్యలు బారిన పడకుండా ఉండవచ్చని సూచించారు. ఈ శిబిరం ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ వారి సౌజన్యంతో నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్లు బి రామాంజనేయులు, ఆర్ రాణిలు 250 మంది విద్యార్థిని, విద్యార్థులకు ఈసీజీ, షుగర్, బిపి, కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కిమ్స్ హాస్పిటల్ పిఆర్ఓ జి గురవయ్య, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ కే పూర్ణచంద్రరావు, ఆర్ మహేష్, పి రోజా, కే వసంత, ఎల్ తేజ, టి కృష్ణవేణి, సిహెచ్ నాగలక్ష్మి, ఎస్ హారిక పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన

విశాలాంధ్ర-సింగరాయకొండ : రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ వారి ఆదేశముల మేరకు సింగరాయకొండ మండలంలోని ట్యాప్సు లీడ్ ఎన్జీవో - మదర్ ల్యాండ్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం సింగరాయకొండ మండలంలోని సచివాలయం 4 సిబ్బందికి "మీకు తెలుసా?" హెచ్.ఐ.వి/ఎయిడ్స్‌పై ఇంటెన్సిఫైడ్ ఐఈసి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా మదర్ ల్యాండ్ సొసైటీ ప్రాజెక్ట్ మేనేజర్ ఆర్.శ్రీనివాసరావు మాట్లాడుతూ హెచ్.ఐ.వి/ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది, హెచ్.ఐ.వి/ఎయిడ్స్ రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, హెచ్.ఐ.వి/ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత, చిన్న చూపు లేకుండా ఎలాగ సమాజములో కలిసి మెలిసి ఉండాలనీ, హెచ్.ఐ.వి/ఎయిడ్స్ ఏక్ట్ 2017, ఎ ఆర్ టి మందులు, ఎ పి సాక్స్ యాప్, టోల్ ఫ్రీ నెంబర్ 1097 గుర్చి వివరించారు. తరువాత మదర్ ల్యాండ్ సొసైటీ ఓఆర్ డబ్ల్యు కె.నాగమణి మాట్లాడుతూ సచివాలయానికి ప్రభుత్వ పథకాల గురించి వచ్చే ప్రజలకు హెచ్.ఐ.వి వ్యాధిపై, సీజనల్ వ్యాధుల వలన కలిగే నష్టాలను గురించి తెలియచేస్తూ సమాజంలో అందరూ ఆరోగ్యంగా ఉండేటట్లు అవగాహన కల్పించాలని తెలియజేశారు. సచివాలయ సెక్రెటరీ డి.సంజీవరెడ్డి, వెల్ఫేర్ అసిస్టెంట్ ఎమ్.మనోహర్ బాబు, ఎఎన్ఎమ్ ఎస్కె.నసీమూన్,మహిళ పోలీసు పి.భారతి, వీఆర్వో పి.తిరుమల, మదర్ ల్యాండ్ సొసైటీ సిబ్బంది ఎమ్.వెంకటరావు, ఎ.సుభాషిణి పాల్గొన్నారు.

శుద్ధ జల కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే 'ఉగ్ర'

విశాలాంధ్ర-పామూరు : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్ధన్ రావు సొంత నిధులతో ఏర్పాటు చేసిన శుద్ధ జల కేంద్రాన్ని (తాగునీరు ప్లాంట్)కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు నరసింహారెడ్డి చేతల మీదుగా శుక్రవారం ప్రారంభించారు. ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వదిలివేయడంతో నిరుపయోగముగా మారిందన్నారు. కోటపాటి జనార్ధన్ రావు తన సొంత నిధులు వెచ్చించి తాగునీరు సౌకర్యమును కల్పించడం అభినంద నీయ మన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ విశాలాక్షమ్మ, ఇరిగినేని రవీంద్రబాబు, మండల టిడిపి నాయకులు యారవ శ్రీనివాసులు, అడుసుమల్లి ప్రభాకర్ చౌదరి పాల్గొన్నారు.

'ఇరిగినేని'కి ఘనంగా నివాళులు

విశాలాంధ్ర-పామూరు : కనిగిరి మాజీ శాసనసభ్యులు స్వర్గీయ ఇరిగినేని తిరుపతి నాయుడు 86వ జయంతి సందర్భంగా శుక్రవారం కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ ఇరిగినేని చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. రాజకీయాల్లో మాట తప్పని, మడమతిప్పని మహా నేతగా, అనునిత్యం ప్రజలతో, ప్రజల మధ్యనే రాజకీయ ప్రస్థానం కొనసాగించారని, మచ్చలేని రాజకీయ నాయకుడిగా, కనిగిరి ప్రజల గుండెచప్పుడు ఇరిగినేని తిరుపతి నాయుడు చిరస్మరణీయమని దారపనిని చంద్రశేఖర్ కొనియాడారు. కార్యక్రమంలో తూర్పు కోడిగుడ్లపాడు మాజీ ఎంపీటీసీ చెనికల పెదమాల కొండయ్య అండ్ బ్రదర్స్, నూతంగి నారాయణ అండ్ బ్రదర్స్, గుర్రం రామ సుబ్బారావు, చెనికల నాగేశ్వరరావు, మానం మల్లికార్జునరావు పెద్దాయనకు ఘనంగా నివాళులర్పించారు.

కూటమి ప్రభుత్వానికి 100 రోజులు

విశాలాంధ్ర-సింగరాయకొండ : కూటమి ప్రభుత్వం వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని మండలంలోని సోమరాజు పల్లి గ్రామపంచాయతీ సచివాలయ మండల పార్టీ అధ్యక్షుడు వేల్పుల సింగయ్య ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి వెళ్లి వంద రోజులు పరిపాలన సంబంధించి కరపత్రాలను పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పంతగాని శ్రీనివాసరావు, వేల్పుల వెంకటరావు పాల్గొన్నారు.

మహారాజశ్రీ ఒంగోలు 7వ అడిషినల్ డిస్ట్రిక్ట్ జడ్జి వారి కోర్టులో

ఓ.యస్.నెం. 57/2022

1) నల్లూరి శ్రీ విద్యా చౌదరి
2) నల్లూరి రేఖా చౌదరి - వాదులు

మరియు

1) నల్లూరి శ్రీనివాసరావు మరియు
4గురు ఇతరులు - ప్రతివాదులు

టు : డి.5
ది ఆథరైజ్‌డ్ ఆఫీసర్, ఆర్.బి.యల్ బ్యాంక్ లిమిటెడ్, 60 అడుగుల రోడ్డు, ఒంగోలు టౌన్, ప్రకాశం జిల్లా

పై నెంబరు దావాలో మరియు ఐ.ఎ. నం. 1404/2022లో 5వ ప్రతివాది/ 5వ రెస్పాండెంట్ అయిన మీకు కోర్టుద్వారా పంపిన నోటీసులు తీసుకోనందున మీకు నోటీసులు జారీ చేయు నిమిత్తము తేది : 27-09-2024కు వాయిదా వేసి మీకు నోటీసును పేపర్ ప్రకటన ద్వారా తెలియపరచవలసినదిగా ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున మీరు పై తెలిపిన వాయిదా తేదీన ఉదయం 10:30 నిIIలకు పై తెలిపిన కోర్టులో స్వయముగా గానీ, లేదా ప్లీడరు గారి ద్వారా గానీ హాజరై మీ యొక్క ఆక్షేపణలను తెలియపరచుకోనవలసినది, లేని యెడల మీ పరోక్షమున దావాను విచారించి తీర్మానించబడును.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

పాదిలి శ్రీనివాసులు, న్యాయవాది
రూం.నెం. 11, ఎ-బ్లాక్, న్యాయవాది సదన్
జిల్లా కోర్టు ప్రాంగణం, ఒంగోలు, ప్రకాశం జిల్లా
ఒంగోలు : తేది : 17-09-2024

సీఎం సహాయ నిధికి రూ.లక్ష విరాళం

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : ఎర్రగొండపాలెం నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ గూడూరీ ఎరీక్షన్ బాబు. వరద బాధితుల సహాయార్థంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రమైన దోరాలలోని భ్రమరాంబ డిగ్రీ కళాశాల యాజమాన్యం లక్ష రూపాయల చెక్కును ముఖ్యమంత్రి సహాయ నిధి క్రింద ఎర్రగొండపాలెం నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ గూడూరి ఎరీక్షన్ బాబుకు, భ్రమరాంబ డిగ్రీ కళాశాల యాజమాన్యం లక్ష రూపాయలు చెక్కును అందజేశారు. విజయవాడలో ఇటీవలవర్షాలకు, వరద బాధితుల సహాయార్థం దోర్నాల పట్టణంలోని భ్రమరాంబ డిగ్రీ కళాశాల యాజమాన్యం బట్టు బ్రదర్స్, 1,00,000/- రూపాయలను సీఎం సహాయ నిధి కింద యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబుకు అందజేశారు. వరద బాధితుల పక్షాన తమవంతు కృషి చేసినందుకు ఎరిక్షన్ బాబు భ్రమరాంబ డిగ్రీ కళాశాల యాజమాన్యాన్ని బట్టు సుధాకర్ రెడ్డి,బట్టు రమణారెడ్డిలను అభినందించారు.

మార్చిలోపు గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి

హౌసింగ్ ఏఈ నిర్మల బాబు

విశాలాంధ్ర-తర్లుపాడు : 2019, 2024 మధ్యకాలంలో గత ప్రభుత్వం పేదలకు పక్క గృహాలు మంజూరు చేయడం జరిగింది. కానీ కొందరు లబ్ధిదారులు వాటిని సకాలంలో పూర్తిచేసు కోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. అనంతరం ఏర్పడిన కూటమి ప్రభుత్వం గృహ నిర్మాణాలు పూర్తి చేసుకోని వారికి 2025 మార్చినాటికిపూర్తి చేసుకోవాలని ఆదేశాలు ఇవ్వడం జరిగింది పూర్తిచేసిన ప్రతి లబ్ధిదారునికి నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఈ ఎసురుపాటును లబ్ధి దారు లకు పార్టీలకతీతంగా ప్రభుత్వం కల్పించిందని ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల హౌసింగ్ ఏఈ నిర్మలబాబు కోరారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్క లబ్ధిదారుడు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

ఇది ప్రజా ప్రభుత్వం

విశాలాంధ్ర-మర్రిపూడి : రాష్ట్ర ప్రభుత్వం వంద రోజుల్లోనే మంచి ప్రజా ప్రభుత్వం అని ప్రజల చేత అనిపించుకుంటుందని మండల తహసీల్దార్ జ్వాలా నరసింహారావు అన్నారు. మండల కేంద్రమైన మర్రిపూడిలో శుక్రవారం కరపత్రాన్ని తహసీల్దార్ జ్వాల నరసింహారావు ప్రారంభించారు. మొట్టమొదటిసారిగా గ్రామ పెద్ద విశ్రాంత ప్రధానో పాధ్యాయులు బి.ఎల్.ఎన్ శాస్త్రి గృహం వద్ద కరపత్రాన్ని చూపుతూ ప్రభుత్వం చేసిన సూపర్ సిక్స్ కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి సభ్యులు తుళ్లూరి నరసింహారావు,మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షులు గొంటు హనుమారెడ్డి, బీసీ నాయకులు, ఎస్సీ నాయకులు పాల్గొన్నారు.

'బూచేపల్లి'కి శుభాకాంక్షలు

విశాలాంధ్ర-ముండ్లమూరు : ప్రకాశం జిల్లా వైయస్సార్ సిపి అధ్యక్షులుగా ఎంపికైన సందర్భంగా దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి మండలంలోని పసుపుగల్లు గ్రామానికి చెందిన వైఎస్ఆర్ సిపి నాయకులు అభినందనలు తెలిపారు. శుక్రవారం ఆయనను స్వయంగా కలిసి పూలమాలు అందజేసి అభినందనలు తెలిపారు. అభినందనలు తెలిపిన వారిలో జిల్లా సర్పంచుల సంఘం మాజీ ఉపాధ్యక్షుడు చింతా శ్రీనివాస్ రెడ్డి, పసుపు గల్లు ఉపసర్పంచ్ బిజ్జం జ్యోతి కృష్ణారెడ్డి ఉన్నారు.

పేదల సంక్షేమం, అభివృద్ధి టీడీపీ ధ్యేయం

ఎమ్మెల్సీ అశోక్ బాబు

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : అభివృద్ధి, సంక్షేమాలతో, ప్రజల జీవితాలలో వెలుగు నింపుతుంది చంద్రన్న ప్రభుత్వం, అని, పేద ప్రజల అభివృద్ధి కోసం ఎన్డీఏ కూటమి యొక్క ముఖ్య ఉద్దేశమని ఎమ్మెల్సీ అశోక్ బాబు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రమైన దోర్నాలలో లోని పంచాయతీ కార్యాలయం వద్ద ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం - కూటమి ప్రభుత్వం ఏర్పడి 100రోజుల సందర్భంగా ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ అశోక్ బాబు, మరియు తెలుగుదేశం పార్టీ ఎర్రగొండపాలెం ఇంచార్జ్, గూడూరు ఎరీక్షన్ బాబు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తి అయిన సందర్భంగా మన ఊరు ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమంలో భాగంగా ఇరువురు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అవ్వ తాతలకు పెంచిన పింఛన్లు అందజేయడం జరుగుతుందని, అలాగే గ్రామాలలో, రోడ్లు మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందని తెలియజేశారు. దోర్నాల పట్టణంలోని పంచాయతీ కార్యాలయంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా కూటమి ప్రభుత్వంలో చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి ప్రజలకు వివరించేందుకు ప్రతి గ్రామంలో గ్రామసభ ద్వారా తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అశోక్ బాబు, యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రభుత్వం ద్వారా ఈ 100రోజులలో ప్రజలకు అందించిన సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గాల మండల ప్రత్యేక అధికారి జగన్నాథరావు, బీజేపీ ఇంచార్జ్ ఎనుముల నాగేశ్వరరావు, ఎంపీపీ గుమ్మ పద్మజా, తాసిల్దార్ కిన్నెర శాంతి, ఎంపీడీవో నాసర్ రెడ్డి,, సర్పంచ్ చిత్తూరు హారిక, అన్ని శాఖల అధికారులు, కూటమి నాయకులు, మండల కన్వీనర్ ఏరువా మల్లికార్జున రెడ్డి, బట్టు సుధాకర్‌రెడ్డి, షేక్ మాబు, మాజీ మండల కన్వీనర్ అంబటి వీరారెడ్డి,దొడ్డ శేషాద్రి, చంటి, ఈదుర మల్లయ్య, పఠాన్ ఖన్,షేక్ మంజూరు,భాష, షేక్ ఇస్మాయిల్, షేక్ నజీర్ భాష షేక్ నజీర్ బాషా, దోర్నాల మండల బిజెపి కన్వీనర్ సురవరం గండి వీరారెడ్డి, మండల జనసేన కన్వీనర్ కే మురళి,, జంగిలి పిచ్చయ్య, పంచాయతీ కార్యదర్శి మోహన్ రావు,తదితర టిడిపి నాయకులు బిజెపి నాయకులు, జనసేననాయకులు, సచివాలయ సిబ్బంది, ఫారెస్ట్ అధికారులు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

ఇది మంచి ప్రజా ప్రభుత్వం

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి

విశాలాంధ్ర-పామూరు : రాష్ట్రం సంక్షోభంలో ఉన్నప్పటికీ సంక్షేమం అందించి అభివృద్ధికి రెక్కలు తొడిగి మొదటి 100 రోజుల్లోనే 'ఇది మంచి కూటమి ప్రభుత్వం' అని ప్రజల చేత అనిపించుకుంటోందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్దన్‌రావు అన్నారు. శుక్రవారం బొట్లగూడూరు గ్రామంలో కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలను ఆవిష్కరించారు. ఇంటి వద్దనే అవ్వాతాతలకు రూ.4వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు పెన్షన్ అందజేత, అన్నక్యాంటీన్‌లతో లక్షలాది మందికి ఆకలి తీరుస్తున్న ప్రభుత్వం.మెగా డీఎస్సీ తో నిరుద్యోగ యువత భవిష్యత్తుకు భరోసా కల్పించిన ప్రభుత్వం. రైతు కష్టం తీర్చేందుకు రూ.1674 కోట్ల ధాన్యం కొనుగోలు బకాయిల చెల్లింపు, ఇక మీదట కూడా ప్రజల ఆకాంక్షలకు, అవసరాలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని జనార్దన్ రావు స్థానికులతో కలిసి ఇంటింటా కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు రమణారావు, బీవీ రమణారావు, టీడీపీ నాయకులు యారవ శ్రీనివాసులు, అడుసుమల్లి ప్రభాకర్ చౌదరి, కోటపాటి నరసింహారావు, దేవరపు మాల్యాద్రి, సయ్యద్ అమీర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలో కృషి ఉజ్వల భవిష్యత్తుకు పునాది

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : విద్యార్థి దశలో కష్టపడి విద్య పట్ల కృషి చేసిన ప్రతి ఒక్క విద్యార్థి తమ జీవితంలో ఉజ్వల భవిష్యత్ కు పునాది వేసుకోగలరని కేజీబీవి ప్రిన్సిపాల్ ఎస్ తిరుమల దేవి అన్నారు. అటువంటి పునాదులు వేసుకునే కేంద్రాలే విద్యాలయాలు. గత సంవత్సరం మార్చినెలలో నిర్వహించిన పబ్లిక్ పరీక్షల్లో పదవ తరగతి, ఇంటర్ మొదటి, రెండో సంవత్సరాలలో మొదటి రెండు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు జిల్లా వ్యాప్తంగా సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు విశ్రాంత ప్రధానోపాధ్యాయులు మార్కాపురం రామ్ భూపాల్ రెడ్డి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈరోజు యర్రగొండపాలెం కస్తూర్బా గాంధీ విద్యాలయాలయం నందు జరిగిన కార్యక్రమంలో ఆర్థిక కారణాలతో విద్యార్థులు మధ్యలో చదువు మానుకోకూడదనే సంకల్పంతో పేద విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు తోడ్పాటునందించారు. కస్తూర్బా గాంధీ కళాశాల ప్రిన్సిపల్ తిరుమల దేవి మాట్లాడుతూ విద్యారంగంలో పేద విద్యార్థులకు చేస్తున్న సేవలను ప్రధానమంత్రి గుర్తించిన రాంభూపాల్ రెడ్డి మన ప్రాంతానికి చెందిన వ్యక్తి కావడం మనకెంతో గర్వకారణమన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులకు జ్ఞాపికలతో పాటు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో యర్రగొండపాలెం ఎంఇఓ పి.ఆంజనేయులు పాల్గొన్నారు.

సీఎంకు స్వాగతం పలికిన గొట్టిపాటి లక్ష్మి

విశాలాంధ్ర-దర్శి : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని హెలిప్యాడ్ వద్దదర్శి టిడిపి ఇంచార్జి గొట్టిపాటి లక్ష్మి స్వాగతం పలికారు. మద్దిరాలపాడు గ్రామానికి శుక్రవారం విచ్చేసిన మన ముఖ్యమంత్రి మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్ప గుచ్ఛం ఇచ్చి సత్కరించారు. వంద రోజుల్లో 1000 మంచి పనులు చేసిన చంద్రబాబు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వరద వంటి విపత్తులను దాటుకొని ప్రజల కోసం నిరంతరం పనిచేస్తూ వంద రోజుల్లో అనేక అద్భుతాలు చేపట్టి ప్రజా సంక్షేమ ప్రభుత్వంగా మన్ననలు పొందుతున్న చంద్రబాబు జేజేలు అంటూ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ కొనియాడారు. ఈ సందర్భంగా దర్శి నియోజకవర్గంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు త్వరితగతిన అమలయ్యేందుకు సహకరించాలని ముఖ్యమంత్రిని కోరారు. వెనుకబడిన దర్శి ప్రాంతంలో అనేక సమస్యలు తిష్ట వేశాయని మన కూటమి ప్రభుత్వంలో దర్శి ప్రాంతాన్ని అభివృద్ధిగా చేయాల్సిన బాధ్యత నేను తీసుకున్నానని డాక్టర్ లక్ష్మి వివరించారు. ఒకసారి దర్శి నియోజకవర్గంలో ముఖ్యమంత్రి బాబు పర్యటించాలని డాక్టర్ లక్ష్మి కోరారు.

27నుంచి జిల్లాస్థాయి రాజకీయ శిక్షణ తరగతులు

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : ఈనెల 27, 28, 29 తేదీలలో పామూరులో జరిగే ప్రకాశం జిల్లా సీపీఐ జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి దేవండ్ల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ, రాష్ట్ర రాజకీయాలలో అనూహ్యమైన మార్పులు జరిగిన నేపథ్యంలో కమ్యూనిస్టులు కూడా దానికి సరిపడా సైద్ధాంతిక శిక్షణ జరపటం ఆవశ్యకతగా ఏర్పడిందన్నారు. ఈ శిక్షణ తరగతులకు రాష్ట్ర జిల్లా స్థాయి నాయకులు హాజరవుతారన్నారు. నియోజకవర్గంలోని జిల్లా సమితి సభ్యులు, మండల కార్యదర్శులు, పార్టీ ప్రధాన బాధ్యులు పామూరులో జరిగే జిల్లా స్థాయి తరగతులకు హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ సీనియర్ నాయకులు టిసిహెచ్ చెన్నయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కెవి కృష్ణ గౌడ్, సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి జి.గురునాథం, త్రిపురాంతకం మండల కార్యదర్శి బాజాల రామయ్య, ఏఐటీయుసి నాయకులు ఆవుల యోగయ్య, గుంటూరు శ్రీను పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

విశాలాంధ్ర-పర్చూరు: రోటరీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక నేతాజీ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు వెలనాటి వెంకటరామ్ జన్మదినాన్ని పురస్కరించుకొని దుప్పట్లు పంపిణీ చేసి విందు భోజనం ఏర్పాటు చేశారు. రోటరీ అధ్యక్షులు తోకల కృష్ణమోహన్ మాట్లాడుతూ వృద్ధులు పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్యవంతమైన జీవితాన్ని కొనసాగించాలని ఆకాంక్షించారు. ఆశ్రమ నిర్వాహకులు రోటరీ వారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి ఆంజనేయులు, సభ్యులు కోట శ్రీనివాసరావు, పాపోలు వెంకన్న, నాగభైరు శ్రీనివాసరావు, గడ్డిపాటి శ్రీనివాసరావు, పోలిశెట్టి చంద్రశేఖర్, దూళ్ళిపల్లి సత్యనారాయణ, అశోక్‌కుమార్, వెంకట సుబ్బయ్యలు ఉన్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

విశాలాంధ్ర-పర్చూరు: విద్యార్థులు విద్యతోపాటు క్రీడలను కొనసాగించాలని చీరాల డివిజన్ ఉపవిద్యాశాఖాధికారి ఏ.శ్రీనివాసరావు తెలిపారు. కారంచేడు మండలం కుంకలమర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల స్థాయి క్రీడలను అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా సౌకర్యాలు ప్రైవేటు పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉన్నాయని తెలిపారు. క్రీడల్లో గెలిచిన విజేతలకు జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో జరిగే పోటీలకు అర్హులని తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి మొలబంటి వెంకటేశ్వర్లు, హెచ్ఎం పద్మావతి, వ్యాయామ ఉపాధ్యాయులు సుబ్బారావు, శ్రీనివాసులు, రమాదేవి ఉన్నారు.

లక్ష్యాలు ఇంటింటికీ చేరాలి: ఎంపీడీవో

విశాలాంధ్ర-పర్చూరు: ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు అయిన సందర్భంగా ప్రభుత్వం సాధించిన లక్ష్యాలను ఇంటింటికీ చేరా లని జిల్లా పాలన అధికారి ఆదేశాల మేరకు మండలంలోని అన్నంభోట్లవారిపాలెం, ఏదుబాడు సచివా లయాల పరిధిలో ప్రజా వేదిక నిర్వహించామని ఎంపీడీవో ప్రద్యుమ్నకుమార్ తెలిపారు. ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశామని, స్టిక్కర్లను ఇంటికి అంటించామని తెలిపారు. కార్యక్రమాలను 26 వరకు నిర్వహించాలని నియోజకవర్గ ప్రత్యేక అధికారి వై.రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ ఏ.రామకృష్ణ, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

వడ్లమూడి మృతికి ఎమ్మెల్యే నివాళి

విశాలాంధ్ర-పర్చూరు: టీడీపీ చిన్నగంజాం మండల బీసీ సెల్ మాజీ అధ్యక్షులు వడ్లమూడి వెంకయ్య అనారోగ్యతో మృతిచెందగా..ఎమ్మెల్యే ఏలూరి సాంబశివ రావు నివాళులర్పించారు. మృతుని కుటుంబానికి ప్రగాఢ సాను భూతి తెలిపారు. వెంకయ్య మృతి కుటుంబానికి, పార్టీకి తీరని లోటు అన్నారు.

శానిటరీ ఇనిస్పెక్టర్‌గా రామచంద్రరావు

విశాలాంధ్ర - రేపల్లె : రేపల్లె మున్సిపాలిటీ శానిటరీ ఇనిస్పెక్టర్‌గా ఆకురాతి రామచంద్ర రావు శుక్రవారం పదవి బాధ్యతలు స్వీకరించారు.తెనాలి మున్సిపాలిటీ నుండి బదిలీపై రేపల్లె మున్సి పాలిటీకి వచ్చి కమిషనర్ సాంబశివరావుకు జా యినింగ్ రిపోర్టును శానిటరీ ఇనిస్పెక్టర్ రామ చంద్రరావు అందజేశారు.అనంతరం పలువురు అభినందనలు తెలిపారు.

ఇసుకపల్లి చేనేత సొసైటీలో

నిలిచిపోయిన వస్త్ర నిల్వలు

ప్రభుత్వాలు రాయితీలతో చేనేత సొసైటీలను ఆదుకోవాలని వినతి

విశాలాంధ్ర - రేపల్లె : దేశంలో వ్యవసాయ రంగం తర్వాత అతి పెద్ద రంగం చేనేత రంగం అ లాంటి చేనేత రంగాన్ని గత ఐదు సంవత్సరాలుగా చేనేత పరిశ్రమను, సొసైటీలను, పట్టించు కున్న పాలకులే లేరని చేనేత కార్మికులు,చేనేత సహకార సంఘాల తాత్కాలిక పాలకవర్గ కమిటీ ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. సొసైటీలకు దాదాపు ఏడు సంవత్సరాల నుండి జిల్లాలో సుమారు రూ.2 కోట్ల మేరకు బకాయిలు సొసైటీలకు చెల్లించవలసి ఉందని, ఇందులో రేపల్లె-ఇసుకపల్లి చేనేత సహకార సొసైటీకి సుమారు రూ.25 లక్షల రాష్ట్ర ప్రభుత్వం నుండి బకాయిలు రావాల్సి ఉన్నా యని సొసైటీ మేనేజర్ కే. శోభన్ బాబు తెలిపారు.గత ప్రభుత్వంలో చేనేత పరిశ్రమకుగాని సొసైటీగాని ఎలాంటి రాయి తీలు, సౌకర్యాలు,మౌలిక వసతులు కల్పించిన దాఖలాలు లేవన్నారు. సొసైటీలకు గతంలో దసరా,దీపావళి, సంక్రాంతి పండుగ సీజన్లో ఇచ్చే 20శాతం రాయితీ పూర్తిగా నిలిపివేశారని సొసైటీలో వస్త్ర నిల్వలు పేరుకుపోయి ఉన్నాయన్నారు.ఆప్కో నుండి సొసైటీలకు రావలసిన బకాయిలు ,వస్త్ర కొనుగోలు చేయటం ఇంతవరకు జరగలేదని దీంతో కార్మికులు నేసిన వస్త్రాలు, దుప్పట్లు, లుంగీలు,టవల్స్, సొసైటీ లో లక్షలాది రూపాయల్లో పేరుకు పోయి ఉన్నాయన్నారు.పండుగ సీజన్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే రాయితీ కూడా నేటి వరకు అమలుపరిచిన సందర్భాలు లేవని అందువలన సొసైటీల్లో వస్త్ర నిల్వలు పేరుకు పోయి ఉన్నాయని తెలిపారు.2018 నుండి చేనేత వస్త్రాలపై 20శాతం రాయితీ ఇవ్వలేదని తెలిపారు. అంతేకాకుండా యారం సబ్సిడీ, పావలా వడ్డీ పాత బకాయిలు,రిబేటు విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు.

నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి

ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు

విశాలాంధ్ర - రేపల్లె : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ వారి ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎబి ఆర్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ నందు మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు ప్రముఖ కంపెనీలైన అపెక్స్ సొల్యూష్యన్స్, రిలయన్స్ (ట్రెండ్స్), డిక్సన్ కంపెనీ ప్రతినిధులు హాజరైయ్యారు. ఈ కంపెనీలకు 25 మందిని ఎంపిక చేసి 62 మందిని షార్ట్ లిస్ట్ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ జాబ్ మేళాకు ముఖ్య అతిథిగా కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎ. కోటేశ్వరరావు మాట్లాడుతూ పెద్ద , చిన్న ఉద్యోగంతోనే ప్రారంభమవుతుందని అలాగే ఉద్యోగ అవకాశం దూర ప్రాంతంలో వచ్చిన సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ వారు రేపల్లెలో ఈ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించడం సంతోషించదగ్గ విషయమని తెలియచేశారు.కంపెనీ ప్రతినిధులు దూర ప్రాంతం నుండి కళాశాలకు వచ్చి అభ్యర్థులను ఎంపిక చేసుకున్నందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.అలాగే కళాశాల స్కాక్ పర్సన్ డి.సంపూర్ణరావు మాట్లాడుతూ నిరుద్యోగ యువకులు ఎప్పటికప్పుడు మారుతున్న కాలానికి అనుగుణంగా తమ యొక్క నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలన్నారు. అలాగే ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ యంగ్ ప్రొఫెషనల్ మాట్లాడుతూ యువత ఎన్ సి ఎస్ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకోవాలని, ఎంప్లాయిమెంట్ వెబ్‌సైట్,ఆన్‌లైన్ ఇవ్వడంతో అభ్యర్థులు జాబ్స్ కోసం రిజిస్టర్ చేసుకోవచ్చని తెలియచేశారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎ. కోటేశ్వరరావు , కళాశాల స్పోక్ డి. సంపూర్ణ రావు, నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బంది సీ.హెచ్. రవి కుమార్ , ఎం. బుల్లియ్య, ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ జిల్లా ఎట్క.పి. హారిక సీడాప్ సిబ్బంది రాంబాబు, అరుణ్ బాబు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికులు స్వచ్ఛత హి కార్యక్రమాలు

విశాలాంధ్ర - రేపల్లె : స్వచ్ఛత హి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆర్టీసీ కార్మికులు వీక్లీ ఆఫ్‌లో భాగంగా రేపల్లె ఆర్టీసీ డిపోలోని కార్మికులు,సిబ్బంది పరిసరాల పరిశుభ్రత,క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాల్లో పాల్గొని పరిసర ప్రాంతాల్లో ఉన్న చెత్త చెదారాన్ని చీపురులతో ఊడ్చి పరిశుభ్రం చేశారు.ఈ కార్యక్రమంలో కెవిరావు,బషీర్,శేఖర్,చిట్టిబాబు, సయ్యద్ బాజీ,బిఎస్ నారాయణ, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, డి.మురళి, ఏసార్ లక్ష్మి,బి.శివమ్మ, సిహెచ్ విజయలక్ష్మి,పివి రమణ,డి.నాగరాజు,రాజబాబు పాల్గొన్నారు.

మండల స్థాయి ఆటల పోటీలు ప్రారంభం

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : బాపట్ల మండల స్థాయి అండర్-17 బాలబాలికల ఆటల పోటీలు ఎంఈఓ నిరంజన్ శుక్రవారం ప్రారంభించారు. 20వ తేది నుంచి 24వ తేది వరకు జరుగుతాయన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికల క్రీడా పోటీలు, రన్నింగ్,షాట్ పుట్, డిస్కస్, జావెలిన్,లాంగ్ జంప్,హై జంప్,రెండు కేటగిరిలలో నిర్వహి స్తారన్నారు. ఎంఈఓ ప్రసాదరావు మాట్లాడుతూ విద్యార్థి దశలో క్రీడలలో పాల్గొనుట ఒక అదృష్టం అని పూర్తిస్థాయి తర్ఫీదు క్రమశిక్షణ అంకితభావంతో ప్రాక్టీస్ చేస్తే సాధించలేనిది అంటూ ఏమీ లేదన్నారు.ప్రతి ఒక్క విద్యార్థి శిక్షణతో పాల్గొంటే విజయం సాధించడం సాధ్యమన్నారు.విద్యార్థి దశ చాలా కీలకమైనదని ఆటలలో పాల్గొనే విద్యార్థులు చదువులో కూడా ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో మునిసిపల్ స్కూలు హెచ్ఎం విజయశ్రీ,కత్తి శ్రీనివాసరావు, ఎన్.టి.రాంబాబు, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వరిలో సూక్ష్మ పోషకాల లోపాలను నివారించాలి

విశాలాంధ్ర - అద్దంకి : వరిలో సూక్ష్మ పోషకాల లోపాలను నివారించాలని మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు.శుక్రవారం కలవకూరు గ్రామంలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మాట్లాడుతూ వరిలో జింక్ లోపాన్ని గుర్తించినట్లు తెలిపారు.జింక్ లోపం ఉన్నప్పుడు ఆకులపై తుప్పురంగులో మారతాయని మొక్క ఎదుగుదల ఆగిపోతుందని ఎంత ఎరువులు వేసినప్పటికీ మొక్క తీసుకోలేదని తెలిపారు.దీని నివారణ కొరకు చిలేటెడ్ జింక్ 100 గ్రాములు ఎకరాకు పిచికారి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కోటేశ్వరరావు,గ్రామ వ్యవసాయ సహాయకులు మస్తాన్‌రావు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధి సీఎం చంద్రబాబుతోనే సాధ్యం

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

విశాలాంధ్ర - మార్టూరు : సంక్షోభంలోనూ సంక్షేమాన్ని అందించి అభివృద్ధికి రెక్కలు తొడిగిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో కూటమి ప్రభుత్వానిదేనని, రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలపడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. శుక్రవారం జొన్న తాళి గ్రామంలో ఎన్డీఏ వందరోజుల పాలన వంద అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేశారు. నూతనంగా సీసీ రోడ్లు, డ్రైయిన్ల నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మొదటి 100 రోజుల్లోనే కూటమి ప్రభుత్వం ఇది మంచి ప్రభుత్వం అని ప్రజల చేత నిరూపించుకుందన్నారు. రాష్ట్ర ఖజానాను జగన్ రెడ్డి దివాళా తీయించినా వంద రోజుల్లోనే వంద కు పైగా అభివృద్ధి, సంక్షేమ కార్య క్రమాలను చేసి చూపామన్నారు. రాష్ట్రానికి చంద్రన్న వంద రోజుల పాలనలో ప్రజలందరికీ ఒక భరోసా కల్పించి ఇది మంచి ప్రభుత్వంగా రుజువు చేసామన్నారు. రానున్న ఐదేళ్లలో గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి అభివృద్ధికి బాటలు వేస్తామన్నారు.ఐదేళ్లలో అద్భుత పాలనతో రూపురేఖలు మారుస్తామన్నారు. గత వైసిపి ప్రభుత్వం లో పంచాయతీలను నిర్వీర్యం చేసిందని కానీ కూటమి ప్రభుత్వంలో డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ సారధ్యంలో పంచాయతీలకు నిధులు కేటాయించి నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం అమరావతికి రూ.15వేల కోట్లు మంజూరు, పోలవరం నిర్మాణానికి రూ.12,500కోట్లు కేంద్రం అనుమతి ఇచ్చారన్నారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లు, కడప జిల్లా కొప్పర్తి పారిశ్రామిక పార్కులకు రూ.25వేల కోట్లు పెట్టుబడులు, 75 వేల మంది యువతకు ఉపాధికి కేంద్రం ఆమోదించిందన్నారు. అన్ని రంగాలను అగ్రగామిలో నిలిపేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలతో ప్రజల ఆకాంక్షలు అవసరాలకు అనుగుణంగా ముందుకు సాగుతుందన్నారు. తొలిత జొన్న తాళి గ్రామంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి సివిల్ సప్లై డిఎం చంద్ర శేఖర్, ఎంపీడీవో నితిన్,ఎమ్మార్వో ప్రశాంతి, గ్రామ సర్పంచ్ శానంపూడి నాగేంద్రమ్మ, మాజీ ఎంపీటీసీ శివరాత్రి శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు తాటి నాగేశ్వర రావు,చైతన్యలు పాల్గొన్నారు.

జడ్పీ ఉన్నత పాఠశాలకు మైక్ సెట్ వితరణ

విశాలాంధ్ర - అద్దంకి : రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ ఆధ్వర్యంలో రోటేరియన్ సృజన అధ్యక్షులు గాడేపల్లి దివాకర్ దత్తు జన్మదిన సందర్భంగా వారి సౌజన్యంతో శుక్రవారం ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మైక్ సెట్ వితరణ చేశారు.కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఊటుకూరి శ్రీనివాసరావు,రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య,కార్యదర్శి చుండూరి మురళి సుధాకర్ రావు,ట్రెజరర్ మల్లాది శ్రీనివాసరావు,దేవ పాలన,రోటరీ పూర్వ అధ్యక్షులు సంధి రెడ్డి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు నారాయణరావు కపర్థి,పార్థసారథి, లక్ష్మి పాల్గొన్నారు.

ఆవులను యజమానులు నియంత్రించాలి

మున్సిపల్ కమిషనర్ హెచ్చరిక

విశాలాంధ్ర - రేపల్లె : పట్టణంలో వాహనదారులకు,చిరు వ్యాపారులకు, స్కూల్స్,కాలేజీ,బస్సులకు,ప్రధాన వీధులలో వాహన రాకపోకలకు రోడ్లపై అవరోధము కలిగిస్తున్న ఆవులను కట్టడి చేయాలని రేపల్లె మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు హెచ్చరికలు జారీ చేశారు.శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రతిరోజూ ఈ ఆవుల సమస్య వేదిస్తోందని సరిగ్గా రోడ్డు మధ్యలో తిష్టవేసి వచ్చే పోయే వాహనాలకు ఇబ్బందికరంగా మారాయని,గంటల తరబడి రోడ్లపై ఇవి నిలబడడం,పడుకోవడం వలన వాహన దారుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని కమిషనర్ తెలిపారు.కావున ఆవులను ఆవుల యజమానులు తక్షణమే స్పందించి ఆవులను తీసుకువెళ్లాలి లేదంటే ఆవులను పోలీసుల సమక్షంలో గోశాలలకు వాటిని తరలింపు చేసే కార్యక్రమం చేపడతామని రేపల్లె మున్సిపల్ కమిషనర్ ఆవుల యజమానులకు విజ్ఞప్తి చేశారు.

సీఎం చంద్రబాబును కలిసిన నియాజీ

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామానికి చెందిన కేంద్ర రైల్వే బోర్డు మాజీ సభ్యులు మోసిన్ నియాజి ముఖ్యమంత్రి నారా చంద్రబాబును కలిశారు. బాపట్ల నియోజకవర్గ అభివృద్ధికి చేపట్టాల్సిన పనులు సీఎంకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపట్ల నియోజకవర్గాన్ని ఆదర్శంగా నిలిపేందుకు సహాయ సహకారాలు అందించాలని సీఎంను కోరినట్లు తెలిపారు. తుఫాను ప్రభావంతో నియోజకవర్గంలో వేలాది ఎకరాలలో పంట నష్టం వాటిల్లిందని రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. తుఫాన్,వరదల కారణంగా తీవ్ర నష్టం చవి చూడాల్సిన వచ్చిందన్నారు. విజయవాడలోని 64వ డివిజన్ లో వరద ప్రభావిత ప్రాంతంలోని గృహాలను సందర్శించి వారికి ఆహార పొట్లాలను అందించి తన వంతు సహకారం అందించినట్లు సీఎంకు తెలిపారు. అనంతరం రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి ఫరూఖ్‌ను కలిసి మైనార్టీల సమస్యల చర్చించానన్నారు.

జీఓ 85ను రద్దు చేయాలని నిరసన

విశాలాంధ్ర - బాపట్ల : ప్రభుత్వం, ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ (పీహెచ్‌సీ) వైద్యుల మధ్య బుధవారం జరిగిన చర్చలు అసంపూర్తిగా ముగిసాయి.చర్చలు సానుకూలంగా ఉన్నాయని ప్రభుత్వం పేర్కొన్నప్పటికీ, వైద్యులు ప్రభుత్వ ప్రతిపాదనలను తిరస్కరించారు. తమ ప్రాథమిక డిమాండ్ అయిన జిఓ 85 రద్దు చేసే వరకు సమ్మె కొనసాగిస్తామని ప్రకటించారు. జీవో 85 రద్దుచేసే సమ్మెలో భా గంగా శుక్రవారం బాపట్ల జిల్లాలోని అన్ని పీహె చ్‌లలో ఉన్న డాక్టర్లు సమ్మె నిర్వహించి డిఎంహెచ్ ఓకి వినతిపత్రం అందజేశారు. అంతేకాకుండా స్వచ్ఛందంగా విధులకు గైర్హాజయ్యారు బాపట్ల డిఎంహెచ్ఓ ఆఫీస్ వద్ద శాంతియుతమైన సమ్మె నిర్వహించారు.సమ్మెను పొడిగించాలని వైద్యుల నిర్ణయంతో, పిహెచ్‌సిలపై ఆధారపడిన గ్రామీణ ప్రాంతాల్లోని రోగులు గణనీయమైన సవాళ్లను ఎదుర్కొనే అవకాశం ఉంది. డాక్టర్ గోపీనాథ్ డాక్టర్ కిరణ్ డాక్టర్ జాన్ ప్రసాద్ డాక్టర్ షైలాబాను డాక్టర్ అనీష్ పాల్గొన్నారు.

సంక్షేమం,అభివృద్దే సీఎం చంద్రబాబు ధ్యేయం

జడ్పీటీసీ సభ్యులు నర్రా సుబ్బయ్య

విశాలాంధ్ర - నిజాంపట్నం : ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్దే ధ్యేయంగా సీఎం చంద్రబాబు సుపరిపాలన సాగిస్తున్నారని జడ్పీటీసీ సభ్యులు నర్రా సుబ్బయ్య అన్నారు.శుక్రవారం మండలంలోని బావాజీపాలెంలో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అయన హాజరయ్యారు.ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో చేసిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ సంక్షోభంలోనూ సంక్షేమం అందించి, అభివృద్ధికి రెక్కలు తొడిగింది కూటమి ప్రభుత్వం అన్నారు.ప్రభుత్వం ఏర్పాటైన ఈ వంద రోజుల్లోనే పెన్షన్ల పెంపు, మెగా డీఎస్సీ, అన్న క్యాంటీన్లు, అమరావతి - పోలవరానికి నిధులు, 'ల్యాండ్ టైటిలింగ్ యాక్టు' రద్దు తదితర ఎన్నో పథకాలు, కార్యక్రమాలను కూటమి ప్రభుత్వం అమలు చేసిందన్నారు.ముఖ్యంగా ఇటీవల విజయవాడను భారీ వరదలు ముంచెత్తాయని వరద సమయంలో ప్రభుత్వం, సీఎం చంద్రబాబు స్పందించిన తీరు ఎంతో గొప్పదని చెప్పుకొవచ్చు అని అన్నారు.ఒక సామాన్యుడి లాగే సీఎం చంద్రబాబు వరద ముంపు ప్రాంతాల్లో తిరుగుతూ సహాయక చర్యలను పర్యవేక్షించారని, వరదల్లో సర్వం కోల్పోయిన వరద బాధితులకు నేనున్నాంటూ సీఎం చంద్రబాబు భరోసా కల్పిస్తూ ప్రజల మన్ననలు పొందారనీ కొనియాడారు.అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి ఇంటింటికి వెళ్లి "ఇది మంచి ప్రభుత్వం" స్టిక్కర్లను అంటించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ నజీర్ అహ్మద్, స్పెషల్ ఆఫీసర్ సురేష్, ఎంపీడీవో ఎన్.నాగలక్ష్మి, గ్రామ టీడీపీ నాయకులు జిలాని, రబ్బాని, మీరా, గాలి రాజు, వీరయ్య, సచివాలయం సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

బడి పిల్లలకు పోషకాహారం ఇవ్వాలి

జిల్లా కలెక్టర్ వెంకటమురళి

విశాలాంధ్ర - బాపట్ల : బడి పిల్లలకు పిండిపదార్థాలు, ప్రొటీన్లు, ఫైబర్, మినరల్స్‌తో కూడిన మంచి భోజనం పెట్టాలని కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. మండల విద్యాశాఖ అధికారులతో శుక్రవారం వర్చువల్ గూగుల్ మీట్‌ని కలెక్టర్ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు బడిలోనే భోజనం చేసేలా అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. మెనూ పక్కాగా అమలు చేయాలని ఆయన తెలిపారు. భోజనం తయారీలో నాణ్యత పాటించాలన్నారు. మధ్యాహ్న భోజన సమయానికి పాఠశాలలను అధికారులు సందర్శించి పరిసరాల పరిశుభ్రతను పరిశీలించాలన్నారు. మధ్యాహ్న భోజనం విద్యార్థులకు అందుతుందా లేదా చూడాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణపై అభిప్రాయాలు, సూచనలను స్వీకరిస్తున్నామన్నారు. ప్రధానోపాధ్యాయులు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు అభిప్రాయాలను తెలియపరచాలన్నారు. మండలాల నుండి వచ్చే సూచనల మేరకు మార్పులు చేయడానికి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు.ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి నారాయణ, విద్యాశాఖ ఏఎస్ఓ సంజయ్ కుమార్, మండలాలలో నుంచి ఎంఈవోలు, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-పామూరు : మండలంలోని బొట్లగూడూరు, కంబాలదిన్నె పంచాయతీలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్దన్ రావు, మండల టిడిపి నాయకులు యారవ శ్రీనివాసులు తహసీల్దార్ బివి రమణారావు ను కోరారు.శుక్రవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి బొట్లగూడూరు గ్రామానికి వచ్చిన తాసిల్దార్ రమణారావుతో జనార్దన్‌రావు, శ్రీనివాసులు రైతుల సమస్యలపై చర్చించారు. రైతులను కార్యాలయం చుట్టూ తిప్పకుండా భూ సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. తహసీల్దార్ రమణారావు మాట్లాడుతూ ఇటీవలనే బాధ్యతలు స్వీకరించానని తన దృష్టికి వచ్చిన సమస్యల తో పాటు పెండింగ్ లో ఉన్న సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తానన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

విశాలాంధ్ర - రేపల్లె : రేపల్లె పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇనిస్పెక్టర్ మల్లిఖార్జున రావుకు. రేపల్లె పట్టణంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోనికి తీసుకుని వారి వద్ద నుండి రూ. 2800 స్వాధీన పరచుకుని వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు సీఐ తెలిపారు.

'మంచి ప్రభుత్వం' కరపత్రాల పంపిణీ

విశాలాంధ్ర-దొనకొండ: ఇది మంచి ప్రభుత్వం కర పత్రాలను అధికారులు ప్రజాప్రతినిధులు శుక్రవారం దొనకొండలో ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. మండల ప్రత్యేకాధికారి, తహసీల్దార్ బి.రమాదేవి ఈ పంపిణీలో పాల్గొని రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులలో ప్రజలు మెచ్చే చేపట్టిన కార్యక్రమాలను తెలియజేస్తూ కరపత్రాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీలలో తదుపరి సంబంధిత కార్యాచరణలపై 20వ తేది నుండి 26వ తేది వరకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. సర్పంచ్ కొంగలేటి గ్రేస్ దేవానంద్, విఆర్ఓ పిచ్చిరెడ్డి, కార్యదర్శి డేవిడ్, సర్వేయర్ వెంకట్రావు, తెదేపా నాయకులు వెంకటేశ్వర్లు, సుబ్బారావు, లక్ష్మణ్, తోహిద్ తదితరులున్నారు.

ప్రజా సంక్షేమం ధ్యేయంగా పాలన

ఎమ్మెల్యే మాలకొండయ్య

విశాలాంధ్ర - చీరాల : సంక్షోభంలోను సరికొత్త అవకాశం సృష్టించుకుంటూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం సుపరిపాలన రాష్ట్ర ప్రజలకు అందిస్తోందని ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వంద రోజులు పరిపాలనలో ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమాన్ని చీరాల మున్సిపాలిటీలోని విజిలి పేట,మరియమ్మ పేటలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సంక్షోభంలోనూ సంక్షేమం అందించి, అభివృద్ధికి రెక్కలు తొడిగి, మొదటి వంద రోజుల్లోనే ఇది మంచి ప్రభుత్వమని ప్రజల చేత కూటమి ప్రభుత్వం అనిపించుకుందన్నారు. వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం, ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా అమలుపరుస్తూ వస్తోందని,పెన్షన్ మూడు నుంచి నాలుగు వేలకు పెంచి ఇచ్చిన మాట ప్రకారం నిరుద్యోగులకు డీఎస్సీ ప్రకటించి 16 వేల పోస్టులు భర్తీ చేయబోతున్నామన్నారు.ప్రతి నెల ఒకటవ తేదీన ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నామని, అన్నా క్యాంటీన్లు ప్రారంభించి ఐదు రూపాయలకే పేదల కడుపులు నింపుతున్నామన్నారు.రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశామని,త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు పథకాలు కూడా అమల్లోకి రాబోతున్నాయన్నారు.గత ప్రభుత్వం పంచాయతీలను నిర్వీర్యంగా మార్చి వేలకోట్లు దారి మళ్లించిందని, సర్పంచులు ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేకపోయారని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పంచాయతీలకు ప్రాణం పోసి వెలుగులు నింపబోతున్నారన్నారు. చీరాల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని ప్రజా ప్రభుత్వంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చక్రవర్తి, సచివాలయ సిబ్బంది,టీడీపీ జనసేన,బీజేపీ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కిషోర్ రెడ్డి చొరవతో కోమలి చెరువు శుభ్రం

విశాలాంధ్ర - పిట్లవానిపాలెం : మండలంలోని కోమలి గ్రామంలో ఉన్న పంచాయతీ మంచినీటి చెరువు ద్వారా ఆ గ్రామ ప్రజలకు మంచి నీరు అందుతుంది. అలాంటి ఆ చెరువులో తూటికాడ విపరీతంగా పేరుకుపోయి అపరిశుభ్రంగా ఉంది.దీంతో ఆ చెరువు అపరిశుభ్రంగా ఉండడంతో చెరువులోని నీరును ప్రజలు తాగేందుకు అనువుగా లేని పరిస్థితి.గత ప్రభుత్వ నాయకులు, అధికారుల నిర్లక్ష్యంతో ఆ చెరువును అభివృద్ధి చేయకుండా, శుభ్రం చేయకుండా కనీసం తూటీ కాడనైనా తొలగింపు చర్యలు చేపట్టలేదు.దీంతో మంచి నీరుకు గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గుర్తించి, చెరువును అభివృద్ధి చేసేందుకు ఆ గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు కిషోర్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు.సమస్యను ఎంఎల్ఏ వేగేసేన నరేంద్ర వర్మ దృష్టికి కిషోర్ రెడ్డి తీసుకువెళ్లారు.ఇటీవల ఎంఎల్ఏ నరేంద్ర వర్మ కోమలి గ్రామాన్ని సందర్శించి కిషోర్ రెడ్డితో పాటు స్థానిక నాయకులు, అధికారులతో కలిసి ఆ చెరువును పరిశీలించారు.గ్రామ ప్రజలకు మంచినీటిని అందించే ఈ చెరువును తక్షణమే శుభ్రం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశానుసారం గ్రామ టీడీపీ నాయకులు కిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు చెరువును శుభ్రపరిచే చర్యలు చేపట్టారు.గ్రామ ప్రజలకు మంచి నీరును అందించే చెరువును శుభ్రపరిచేందుకు ప్రత్యేక చొరవ తీసుకున్న కిషోర్ రెడ్డికి గ్రామ ప్రజలు ప్రత్యేకంగా అభినందిస్తూ కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

ఎస్ఐ పిచ్చిరెడ్డికి సన్మానం

విశాలాంధ్ర-గిద్దలూరు : పట్టణ బీజేపీ అధ్యక్షులు అపిసెట్టి ఉదయ్ శంకర్ ఆధ్వర్యంలో గిద్దలూరు రైల్వే స్టేషన్‌లో ఎస్ఐ కె పిచ్చిరెడ్డిని సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ కొన్ని లక్షల మంది ప్రయాణికులు రైల్వేల ద్వారా తమ గమ్యస్థానాలకు వెళుతున్నారు. వారికి ఎటువంటి అభద్రత లేకుండా వారికి ధైర్యం కల్పించడంలో భద్రతా సిబ్బంది ముఖ్య పాత్ర పోషించడం ఎంతో గర్వ కారణమని కావున వారిని సన్మానిచడం ఎంతో గర్వంగా ఉంది అని పట్టణ అధ్యక్షులు తెలియ చేయడం జరిగింది. ముఖ్య అతిథిగా జిల్లా ఉపాధ్యక్షులు భవనాసి వెంకట రామాంజనేయులు పాల్గొన్న ఈ కార్య క్రమంలో జిల్లా మైనార్టీ అధ్యక్షులు షేక్ ఖాదర్ వలీ షఫీ,జిల్లా ఓబిసి మోర్చ కార్యవర్గ సభ్యులు వీర చక్రము,సీనియర్ నాయకులు మారుతి ప్రసాద్,బీజేపీ యువ నాయకులు కృష్ణ ,టీడీపీ నాయకులు లకుమారపు శ్రీను పాల్గొనడం జరిగింది.అంతే కాకుండా రైల్వే సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ అల్తాఫ్ హుస్సేన్,కానిస్టేబుల్స్ శేషయ్య, సాంబశివ రావు,రసూల్ పాల్గొనడం జరిగింది.

స్వయంకృషి సేవా సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛత హి సేవా

విశాలాంధ్ర-పామూరు : జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు స్వచ్ఛత హి సేవా 2024 కార్యక్రమం కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో స్వయంకృషి సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మొక్కలు నాటడం జరిగింది. ఈ సందర్భంగా సేవా సంస్థ అధ్యక్షులు షేక్ నాయబ్ రసూల్ మాట్లాడుతూ సెప్టెంబరు 17 నుండి అక్టోబరు 2 వరకు స్వచ్ఛత హి సేవ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ కే సజన, విద్యార్థినిలు, ఉపాధ్యాయినీలు పాల్గొన్నారు.

'ఇది మంచి ప్రభుత్వం' ప్రారంభం

గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల

విశాలాంధ్ర-గిద్దలూరు : రాష్ట్రంలో పేదలకు సంక్షేమాన్ని అందించే మంచి ప్రభుత్వ పాలన కొనసాగుతుందని, బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ఎన్డీయే ప్రభుత్వ లక్ష్యమని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో "ఇది మంచి ప్రభుత్వం" అనే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పేదలకు గత వైసీపీ ప్రభుత్వం అందించే సామాజిక పింఛన్లను రూ.3000 నుంచి ఒకేసారి రూ. 4000లకు పెంచి అత్యంత సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు చేసి ప్రజల ఆస్తులకు ముఖ్యమంత్రి చంద్రబాబు భద్రత కల్పించారని, ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెల 1న జీతాలు చెల్లింపు కార్యక్రమం చేపట్టారు. నిరుద్యోగ యువతీ యువకులకు అండగా 16 వేల437 మందికి ఉద్యోగాలు కల్పించడానికి కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీని ప్రకటించడం హర్షించదగ్గ శుభ పరిణామం అన్నారు. పేదల ఆకలి తీర్చడానికి ప్రభుత్వం అన్న క్యాంటీన్ ద్వారా రూ.5 లకే కడుపు నిండా నాణ్యమైన భోజనం అందించే బృహత్తర కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా "అన్న క్యాంటీన్" లకు ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారని నిన్నటి రోజు వేలాది మంది ప్రజల మధ్య గిద్దలూరు పట్టణంలో అన్న క్యాంటీన్ ప్రారంభించటం జరిగిందన్నారు. వైసీపీ పాలనలో గ్రామ పంచాయతీలను నిర్వీర్యం చేసిందని, ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు రూ. 1452 కోట్లు మంజూరు చేసి పంచాయతీలకు ప్రాణం పోసిన ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది చంద్రన్న కూటమి ప్రభుత్వమన్నారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, జడ్పీటీసీ సభ్యులు బుడతా మధుసూదన్ యాదవ్, కమిషనర్ వెంకటదాసు, గిద్దలూరు ఎమ్మార్వో ఆంజనేయరెడ్డి, మాజీ సర్పంచ్ దప్పిలి భాస్కర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు సయ్యద్ శానేశావలి, పట్టణ కౌన్సిలర్లు, గిద్దలూరు ఎండీఓ, ఎంఈఓలు, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇరిగినేని చిరస్మరణీయుడు: ఎమ్మెల్యే ఉగ్ర

విశాలాంధ్ర-పామూరు : కనిగిరి మాజీ శాసనసభ్యులు స్వర్గీయ ఇరిగినేని తిరుపతి నాయుడు చిరస్మరణీయుడని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం స్వగ్రామమైన మోపాడు గ్రామంలో ఇరిగినేని 82వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఇరిగినేని తనయుడు రవీంద్రబాబు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్ధన్ రావు, టిడిపి మండల నాయకులు యారవ శ్రీనివాసులు మొదలగు ఎన్డీఏ కోటమి నాయకులతో కలిసి ఇరిగినేని ఘాటు వద్ద సమాధికి ఉగ్ర నరసింహారెడ్డి పూలమాలతో ఘన నివాళులర్పించారు. అనంతరం మోపాడు బస్టాండు, బొట్లగూడూరులలో ఉన్న ఇరిగినేని విగ్రహానికి పూలమాలతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ మోపాడు గ్రామ సర్పంచిగా, కనిగిరి సమితి ప్రెసిడెంట్‌గా, మూడు పర్యాయాలు కనిగిరి శాసనసభ్యులుగా ఎన్నికై నియోజకవర్గానికి ఎనలేని సేవలు అందించిన ఘనత ఇరిగినేనికే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రతిభావంతుల రాష్ట్ర కార్యదర్శి,అడుసుమల్లి ప్రభాకర్‌రావు, ఒంగోలు పార్లమెంట్ టిడిపి కార్యదర్శి సయ్యద్ అమీర్ బాబు, మోరుబోయిన హుస్సేన్ రావు యాదవ్, కోటపాటి నరసింహారావు, గుంటుపల్లి శ్రీనివాసులు, జనసేన నాయకులు వై రహీముల్లా, బిజెపి నాయకులు కొండిశెట్టి రమణయ్య,డోలా శేషాద్రి, అక్కిదాసరి సత్యం, గుత్తి మహేష్, మండ్ల రమణయ్య, మహేష్, టీడీపీ శ్రేణులు మరియు ఇరిగినేని అభిమానులు పాల్గొన్నారు.

ఆటల పోటీలు ప్రారంభం

విశాలాంధ్ర-దొనకొండ: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో 68వ ఎస్‌జీఎఫ్ మండల స్థాయి ఆటల పోటీలు హెచ్ఎం వివి రామాంజనేయులు ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభించారు. రెండు రోజుల పాటు జరుగు పోటీల్లో మండలంలోని పాఠశాలలకు చెందిన 350 మంది విద్యార్థులు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. అథ్లెటిక్స్, యోగా, చెస్, షటిల్ పోటీలు శనివారం నిర్వహిస్తామని వ్యాయామ ఉపాధ్యాయులు కాలే నరసింహారావు తెలిపారు.

'ఇది మంచి ప్రభుత్వం' ప్రారంభం

విశాలాంధ్ర-పీసీపల్లి : ఎన్డీఏ కూటమి ప్రభుత్వం నూతనంగా ఏర్పడి వంద రోజులు పూర్తైన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో 13 గ్రామ సచివాలయాల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభించడం జరిగిందని ఎంపీడీవో శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. 20వ తారీకు నుంచి 26వ తేదీ వరకు మండలంలో 13 గ్రామ సచివాలయాల పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి గడిచిన వంద రోజులలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు అభివృద్ధి ప్రజా ఉపయోగ కార్యక్రమాలు సాధించిన ప్రగతి వివరించటం జరుగుతుందని ఈ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రతి సచివాలయానికి ఒక మండల స్థాయి ప్రత్యేక అధికారిగా నియమించటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండలాధికారులు గ్రామ సచివాలయ సిబ్బంది ఎన్డీఏ కూటమి ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు పీవీఆర్ చౌదరి సంతాప సభ

విశాలాంధ్ర-ఒంగోలు : సిపిఐ నగర కార్యదర్శి, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు కామ్రేడ్ పీవీఆర్ చౌదరి సంతాప సభ ఈ నెల 21వ తేదీ ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో నిర్వహిస్తున్నట్లు సీపీఐ సీనియర్ నాయకులు ఉప్పుటూరు ప్రకాశరావు ఒక ప్రకటనలో తెలిపారు. పీవీఆర్ చౌదరి ఈనెల 14వ తేదీన గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. సుమారు 35 సంవత్సరాలుగా ప్రకాశంజిల్లా సిపిఐ పార్టీ నాయకుడుగా, ఏఐటీయూసీ జిల్లా నాయకులుగా సేవలందించి నగరంలో అందరిచే ఆత్మీయుడుగా కొనియాడబడిన చౌదరి అస్తమయం పార్టీకి, కార్మిక వర్గానికి తీరని లోటు. ఆయన మృతికి నివాళు లర్పించేందుకు సి.పి.ఐ పార్టీ కార్యాలయము నందు సంతాప సభ ఏర్పాటు చేయడమైనది. కమ్యూనిస్టు పార్టీ సభ్యులు సానుభూతిపరులు వామపక్ష పార్టీ శ్రేణులు, వివిధ కార్మిక వర్గ శ్రేణులు. చౌదరి అభిమానులు సంతాపసభలో పాల్గొనవలసినదిగా సీపీఐ సీనియర్ నాయకులు ఉప్పుటూరి ప్రకాశరావు ఒక ప్రకటనలో తెలిపారు.

23లోపు ఈ క్రాప్ రైతులు నమోదు చేసుకోవాలి

వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు విజయబాబు

విశాలాంధ్ర – రేపల్లె : రైతు సేవా కేంద్రాల్లో ఈనెల 23వ తేదీ లోపు రైతులు పంట నమోదు చేసుకోవాలని రేపల్లె సబ్ డివిజన్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఆర్ విజయబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఈ పంట నమోదుకు సంబంధించి ఈనెల 23వ తేదీ లోపు రైతులు తమ యొక్క పంట నమోదు వివరాలను రైతు సేవా కేంద్రాల్లో ఉండే విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్లకు వివరాలు ఇచ్చి పంట నమోదు చేసుకోవాలని, 23వ తేదీ పంట నమోదుకు ఆఖరి తేదీ అని తెలిపారు. కావున రైతులు వెంటనే పంటను నమోదు చేసుకోవాలని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే ఉపేక్షించం

- 81 మందిపై కేసులు నమోదు
- జిల్లా ఎస్పీ తుషార్ డూడి

విశాలాంధ్ర – బాపట్ల : బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే ఉపేక్షించేది లేదని జిల్లా ఎస్పీ తుషార్ డూడి అన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో జిల్లా పోలీస్ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై కఠిన చర్యలు తీసుకున్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం చట్టవిరుద్ధమని, ఇటువంటి కార్యకలాపాలు ప్రజలకు అసౌకర్యం కలిగించడంతో పాటు, శాంతిభద్రతలకు భంగం కలిగించే అవకాశం ఉందన్నారు. అందువల్ల జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి జిల్లాలో బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తున్న వారిని అదుపులోకి తీసుకొని వారిపై కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. గత రాత్రి నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో మొత్తం 81 మందిపై కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. వారిని సంబంధిత న్యాయస్థానం ఎదుట హాజరుపరిచి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు . ఇదే విధానం జిల్లాలో కఠినంగా అమలు చేస్తామన్నారు. దాబాలు, ఫ్యామిలీ రెస్టారెంట్లు, హోటల్లు ఇతర అనుమతి లేని ప్రదేశాలలో మద్యం సేవిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. వాటి నిర్వాహకులపై కూడా కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. జిల్లా పోలీస్ అధికారులు సిబ్బంది వారి పరిధిలోనే బహిరంగ ప్రదేశాలపై నిఘా ఉంచాలన్నారు. ఆ ప్రదేశాలలో గస్తీ పెట్రోలింగ్ ముమ్మరంగా నిర్వహిస్తూ ఉండాలన్నారు. విజిబుల్ పోలింగ్, పల్లెనిద్ర కార్యక్రమాలు నిర్వహించే సమయాలలో ప్రజలతో మమేకమై ఆ పరిధిలో జరిగే అసాంఘిక కార్యకలాపాల గురించిన సమాచారం తెలుసుకోవాలన్నారు. తద్వారా ఆ ప్రదేశాలపై నిఘా ఉంచి అసాంఘిక కార్య కలాపాలను కట్టడి చేయవచ్చునన్నారు. జిల్లా ప్రజలు కూడా పోలీస్ శాఖకు సహకరించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు గురించిన సమాచారం తెలిసిన యెడల దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌కు, (లేదా) డయల్ 100,112 నెంబర్లకు కాల్ చేసి సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని ఎస్పీ తెలిపారు.

బాపట్లలో 'మన ఇల్లు-మన గౌరవం'

విశాలాంధ్ర – బాపట్ల టౌన్ : మన ఇల్లు మన గౌరవం అనే నినాదంతో వంద రోజుల ప్రణాళికతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం బాపట్ల పురపాలక సంఘం కౌన్సిల్ హాల్‌లో మునిసిపల్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జెవిఎస్ఆర్ కె.ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లే అవుట్‌ల నందు అసంపూర్తిగా నిలిచిపోయిన గృహాల యొక్క ప్రస్తుత పరిస్థి తులు గురించి సిబ్బందితో సమీక్ష చేశారు. గృహ యజమానులు హౌసింగ్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది సమన్వయం చేసుకొని క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలు తెలుసుకోవాలని కోరారు. ఆర్థికంగా ఇబ్బంది పడుతూ నిర్మాణం చేపట్టలేక మధ్యలోనే ఆపివేసిన నిర్మాణాల యజమానులతో మాట్లాడి మెప్మా సివోలు ఆర్పీల సహకారంతో లబ్ధిదారులకు బ్యాంకు ఋణములు ఇప్పించి గృహాలను త్వరితగతిన నిర్మాణం పూర్తి చేయడానికి అన్ని చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అసంపూర్తిగా ఉన్న గృహాలు త్వరితగతిన వంద శాతం పూర్తి చేయడానికి అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ కె.సాహితి, మెప్మా సివోలు, సచివాలయ సిబ్బంది, మెప్మా ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సంక్షేమ పథకాలు వివరించాలి

విశాలాంధ్ర – యద్దనపూడి : రాష్ట్ర ప్రభుత్వం వంద రోజుల్లో చేసిన హామీల అమలను ప్రజలకు తెలియజేయాలని ఎంపీడీవో కృష్ణకుమారి అన్నారు. యద్దనపూడి మండలంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పెద్దివారిపాలెం, జాగర్లమూడిలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో టీవీ కృష్ణ కుమారి మండలం స్పెషల్ ఆఫీసర్ ఈఓపిఆర్ ఆర్‌డి సిహెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం వంద రోజుల పాలన లో చేసిన సంక్షేమ పథకాల, వెల్ఫేర్ స్కీమ్స్ పెన్షన్స్ పెంపు, అన్న కాంటీన్ పునరుద్దరణ, వంటి మంచి కార్యక్రమాలు గురించి పంచాయతీ కార్యదర్శులు ప్రజల కు తెలియజేయాలన్నారు. ప్రభుత్వం చేసిన,పథకాల గురించి ప్రజలకు వివరించాలని అన్నారు. మండలంలోని 14గ్రామ పంచాయతీల్లో ఈనెల 26 వరకు ఏఏ గ్రామాలలో జరిగేది సంబంధిత షెడ్యూల్ ను ఎంపీడీవో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

వంద రోజుల పాలన అభివృద్ధి,సంక్షేమంపై సమీక్ష

- ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ

విశాలాంధ్ర – పిట్టలవానిపాలెం : వంద రోజుల ఎన్డీఏ పాలన అభివృద్ధి సంక్షేమ పాలనపై మండలంలోని గోకరాజువారిపాలెంలో అధికారులతో కలిసి ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇది మంచి ప్రభుత్వం ప్రజా వేదిక కార్యక్రమంలో పాల్గొని తానే స్వయంగా ప్రతి ఇంటికి వెళ్లి ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లను అంటించి కరపత్రాలను పంపిణీ చేసి వంద రోజులలో ప్రభుత్వం చేసిన పనులను గురించి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 జూన్ 12న నారా చంద్రబాబు నాయుడు ముఖ్య మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి సెప్టెంబర్ 20వ తేదీకి వంద రోజులు అయిందన్నారు. ఈ మూడు నెలలో వందకు పైగా అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను చేశారన్నారు. మొదటి వంద రోజుల్లో జగన్ ప్రభుత్వం రూ.250 పెన్షన్ పెంచడం తప్ప మరే ఇతర హామీని అమలు చేయలేదన్నారు. నేడు చంద్రన్న చల్లని పాలనలో ప్రజలు స్వేచ్ఛగా జీవించ గలుగుతున్నారన్నారు. వంద రోజుల్లో సాధించిన ప్రముఖ విజయాలను వివరించారు. పేదవారి ఆకలి తీర్చేందుకు సీఎం చంద్రబాబు రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే వంద పైగా అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసి పేదల పెన్నిధి అయ్యారన్నారు. చంద్రబాబు ఎన్నికల హామీలలో భాగంగా ఇచ్చినా ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు చేసి ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించారన్నారు. వరదల్లో పంట నష్టం ఎకరాకు రూ.2 వేల నుండి రూ.10 వేలకు పెంచిదన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం బియ్యంతోపాటు పంచదార,గోధుమ పిండి కూడా ఇచ్చారని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా రూ.6.50 కోట్ల రూపాయలు పెంచి 54 లక్షలు మందికి అదనంగా లబ్ధి పొందరాని తెలిపారు. రానున్న ఐదు సంవత్సరాలలో రూ.పది లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షణ ఏడు లక్షల యాభై వేలు మందికి ఉపాధి ఉద్యోగ అవకాశాలను మెరుగుపరిచే విధంగా టీడీపీ ప్రభుత్వం ముందుకు వెలుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఓ రవీందర్,జనసేనా నియోజకవర్గ సమన్వయకర్త నామనశివన్నారాయన,టీడీపీ సీనియర్ నాయకులు మోదుగుల శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

22న కావూరివారిపాలెం గ్రామసభ

విశాలాంధ్ర – చీరాల రూరల్ : నేటి నుంచి చీరాల మండలంలోని ఈపురుపాలెం గ్రామ పంచాయతీలో 22వ తేదీ ఆదివారం కావూరి వారిపాలెం గ్రామ పంచాయితీలో గ్రామసభలు నిర్వహించడం జరుగుతుందని చీరాల మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె నేతాజీ తెలిపారు. ఈ గ్రామసభలకు ఎమ్మెల్యే ఎం ఎం కొండయ్య ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ఈ గ్రామ సభలలో కలెక్టర్ ఆదేశాల మేరకు మండల అధికారులు, సిబ్బంది పాల్గొనాలని కోరారు.

యాంటీ ర్యాగింగ్ కమిటీ సభ్యునిగా సాంబయ్య

విశాలాంధ్ర – బాపట్ల : బాపట్ల వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల యాంటీ ర్యాగింగ్ కమిటీ సభ్యునిగా 2024-25 సంవత్సరానికి పెదగొల్ల పాలెం మాజీ సర్పంచ్, ఆదర్శ ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి బొమ్మా నబోయిన సాంబ య్యను అసోసియేట్ డీన్ డాక్టర్ డి.డి స్మిత్ నియమించారు. ఈ సందర్భంగా సాంబయ్య మాట్లాడుతూ నాకు ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని తెలిపారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

విశాలాంధ్ర – రేపల్లె : మీకు కష్టం ఎదురైనప్పుడు మీ కుటుంబానికి పెద్దకొడుకుగా ఉండి ఆదుకుంటానని వాగ్దానం చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సీఎం సహాయ నిధి నుండి రేపల్లె రూరల్ మండలం ఉప్పూడి గ్రామానికి చెందిన సుఖవాసి శ్రీధర్ 47,324 రూపాయాల చెక్‌ను టిడిపి నాయకులు అనగాని శివప్రసాద్ శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి లీగల్ సెల్ రేపల్లె నియోజకవర్గ కన్వీనర్ న్యాయవాది వై ధర్మతేజ, తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ఆటల పోటీలు ప్రారంభం

విశాలాంధ్ర – చీరాల రూరల్ : చీరాల మండలం దేవాంగపురి లోని బివి అండ్ బియన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం ఉదయం అండర్ 14, అండర్ 17 బాలబాలికల ఆటల పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థినీ విద్యార్థుల కేరింతల మధ్య చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే క్రీడలను ప్రోత్సహిస్తే దేశానికి గర్వకారణమైన క్రీడాకారులు తయారవుతారని అన్నారు. చీరాల మండల విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యేశ్వర రావు మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తితో క్రీడాకారులు క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. స్కూల్ గేమ్స్ నియోజకవర్గ సమన్వయకర్త సీతాదేవి, కే.రాణి, పిడి కోటపాటి శ్రీనివాసు సమన్వయం చేస్తూ ఎటువంటి ఆటంకం లేకుండా మొదటి రోజు క్రీడలు ముగిసేలా చూశారు. శనివారం అథ్లెటిక్స్ పోటీలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి నాతాని ఉమామహేశ్వర రావు, తెదేపా, భాజపా, జన సేన పార్టీల నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.